# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 7-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:239 పేజీలు:6 వెల: రూ.1/-


## నేడు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎన్డీయే ఎంపీల సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 6 : నూతనంగా ఎన్నికైన ఎంపీలతో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే శుక్రవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన ఎంపీలు హాజరు కానున్నారు. కూటమి నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితం కావడంతో జేడీయూ, టీడీపీ సహా భాగస్వామ్య పార్టీల తోడ్పాటు అనివార్యమైంది. కాగా ఎన్డీయే పార్టీలు ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీని తమ నేతగా ఎన్నుకున్నాయి. ఎన్డీయే ఎంపీల సమావేశంలో నూతన ఎంపీలు తమ నేతగా మోదీని ఎన్నుకుంటూ తీర్మానం చేయడంతో పాటు తీర్మాన ప్రతిని సంకీర్ణ నేతలు రాష్ట్రపతికి అందించనున్నారు. ఇక జూన్ 9న నరేంద్ర మోదీ మూడవసారి దేశ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎన్డీయే వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఎన్డీయే కూటమిలో కీలకంగా మారిన టీడీపీ చీఫ్ చంద్రబాబునాయుడు రేపు తమ పార్టీ ఎంపీలతో కలిసి ఎన్డీయే సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లనున్నారు.

### చురక

స్వంతంగా బలంలేని
సంకీర్ణము ఇక కష్టమే
ఎప్పుడైనా సంక్షోభం
ఎగిసిపడుట స్పష్టమే
ఏకపార్టీ బుల్డోజర్
ఏలికకు ఇక బ్రేకులు
గల్లంతే సాహసించి
గతితప్పితే ట్రాకులు



-వేల్పుల నారాయణ
9440433475

## ప్రమాణ స్వీకారమహోత్సవం .. పండుగలా జరపాలని భావిస్తున్న ఎన్డీఏ

-తరలిరానున్న విదేశీ అతిథులు
-పలువురికి ట్విట్టర్‌లో సందేశం
-స్వయంగా ఫోన్ కాల్ చేసి ఆహ్వానించిన మోదీ
-బంగ్లాదేశ్, మారిషస్, నేపాల్ ప్రధానాలకు పిలుపు
-శ్రీలంక అధ్యక్షుడు, భూటాన్ రాజుకు కబురు
-బంగ్లా ప్రధాని షేక్ హసీనాకు ప్రత్యేక ఆహ్వానం
-దేశ, విదేశీ లీడర్ల నుంచి అభినందనలు
-పొగడ్తలతో ముంచెత్తిన అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్

న్యూఢిల్లీ, జూన్ 6 :నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కానున్నారు. ముచ్చటగా మూడోసారి ఆయన అధికారంలోకి రానున్నారు. అయితే.. మోదీ ప్రమాణ స్వీకారోత్సవం ఈ వారంలో జరగనుంది, ఈ స్వీకారోత్సవానికి నేపాల్, బంగ్లాదేశ్ , మారిషస్ ప్రధానులు, శ్రీలంక అధ్యక్షుడు, భూటాన్ రాజును ఆహ్వానించారు, ప్రమాణ స్వీకారోత్సవానికి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, నేపాలీ ప్రధాని పుష్ప కమల్ దహల్, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జుగ్‌నాథ్‌ను మోదీ ఆహ్వానించారు. ఇక.. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే. డ్రుక్ గ్యాల్పో జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్ కూడా ఆహ్వానం అందినట్లు సమాచారం. వీరికి వరుస ట్వీట్లతోపాటు వీరితో తాను టెలిఫోన్ కాల్ చేసానని మోదీ చెప్పారు.

మోదీకి అభినందనల వెల్లువ..

భారత్‌లో అత్యధిక స్థానాలు గెలుచుకుని మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న ఎన్‌డీఏకి విదేశాల నుంచి పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తాయి. ఇందులో అమెరికా అధ్యక్షుడు జో బిడెన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, బ్రిటన్ ప్రధాని రిషి సునక్, జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ ప్రపంచ అగ్రగామిగా ఉన్నారు. సుక్ యోల్, డజన్ల కొద్దీ ఇతర నాయకులు ఎన్‌డీఏ ఎన్నికల విజయంపై మోదీకి అభినందనలు తెలిపారు.

## కొత్తగా ఎన్నికైన 280 మంది ఎంపీలు

న్యూఢిల్లీ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: 18వ లోక్‌సభ ఎన్నికల్లో 280 మంది ఎంపీలు కొత్తగా కనిపించనున్నారు. 2024 ఎన్నికల్లో తొలిసారి 280 మంది ఎంపీలుగా ఎన్నికయ్యారు. 2019లో ఆ సంఖ్య 267గా ఉంది. ఇప్పుడు ఆ సంఖ్య పెరిగింది. తాజా ఎన్నికల్లో ఎన్నికైన వారిలో 263 మంది గతంలోనూ ఎంపీలుగా చేశారు. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసర్చ్ సంస్థ ఈ డేటాను ఇచ్చింది. మళ్లీ ఎన్నికైన ఎంపీల్లో.. 8 మంది తమ నియోజకవర్గాన్ని మార్చుకున్నారు. ఒకరు మాత్రం రెండు నియోజకవర్గాల నుంచి ఎన్నికయ్యారు. 17వ లోక్‌సభలో ఓ పార్టీ తరఫున ఎన్నికైన 9 మంది ఎంపీలు.. ఈసారి మరో పార్టీ గుర్తుపై మళ్లీ ఎంపీలుగా ఎన్నికయ్యారు. 53 మంత్రులు పోటీ చేయగా, దాంట్లో 35 మంది మాత్రమే ఎన్నికయ్యారు. 18వ లోక్‌సభలో బీజేపీ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఆ పార్టీ 240 సీట్లు గెలుచుకున్నది. రెండో స్థానంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నది. ఆ పార్టీకి 99 సీట్లు వచ్చాయి. సమాజ్‌వాదీ పార్టీ 37 సీట్లతో మూడవ స్థానంలో ఉన్నది.

## సీఎం రేవంత్‌తో వివేక్ కుటుంబం భేటీ



హైదరాబాద్, జూన్ 6 :రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వివేక్ వెంకటస్వామి కుటుంబం మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దపల్లి లోక్ సభ సభ్యునిగా గడ్డం వంశీ గెలుపొందిన సందర్భంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుటుంబం గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎంపీగా గెలుపొందిన వంశీని రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రధాని, హోంమంత్రి సలహాలతో కుదేలైన రిటైల్ ఇన్వెస్టర్లు

### – ఎగ్జిట్ పోల్స్ వ్యవహారంపై విచారణకు రాహుల్ డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 6 :స్టాక్ మార్కెట్‌లో మదుపు చేసే ఐదు కోట్ల కుటుంబాలకు ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఎందుకు పెట్టుబడి సలహాలు ఇచ్చారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. వారి పని పెట్టుబడి సలహాలు ఇవ్వడమా అని ఆయన నిలదీశారు. షేర్ల విలువను తారుమారు చేసిన ఆరోపణలపై సెబీ దర్యాప్తును ఎదుర్కొంటున్న బిజినెస్ గ్రూప్‌నకు చెందిన మీడియా సంస్థలకు ఇచ్చిన పలు ఇంటర్వ్యూల్లోనే ఎందుకు వీరు పెట్టుబడి సలహాలను ఇచ్చారని ప్రశ్నించారు.

తప్పుడు ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఇచ్చిన వారికి, బీజేపీకీ, ఐదు కోట్ల వేతన జీవుల కష్టార్జితాన్ని కొల్లగొట్టేందుకు ఎగ్జిట్ పోల్స్‌కు ఒక్కరోజు ముందు పెట్టుబడి పెట్టిన విదేశీ ఇన్వెస్టర్ల మధ్య ఉన్న సంబంధం ఏంటని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)చే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీని వెనుక భారీ కుట్ర, కుంభకోణం ఉందని అన్నారు. షేర్లు కొనాలని ప్రధాని, కేంద్ర హోంమంత్రి సూచనలతో పెట్టుబడిన పెట్టిన భారత రిటైల్ ఇన్వెస్టర్ల వేలాది కోట్ల రూపాయల సొమ్మును కొందరు కాజేశారని ఆరోపించారు.

ఈ మొత్తం వ్యవహారంపై విచారన జరిపించాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇది అదానీ అంశంతో ముడిపడిన నిగూఢ అంశమని, ఇందులో ప్రధాని, కేంద్ర హోంమంత్రి నేరుగా జోక్యం చేసుకున్నారని ఆరోపించారు. ఐబీ నివేదికలు, పార్టీ వర్గాల సమాచారం ఆధారంగా ఎన్నికల ఫలితాలపై వీరికి ఓ అంచనా ఉంటుందని, అయితే ఈ డేటా ఆధారంగా షేర్లు కొనాలని రిటైల్ ఇన్వెస్టర్లకు ఓ ప్రధాని సలహా ఇవ్వడం దేశంలో ఇంతవరకూ ఎన్నడూ జరగలేదని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. స్టాక్ మార్కెట్‌పై ఓ ప్రధాని ఎన్నడూ వ్యాఖ్యలు చేయలేదని, కానీ ప్రధాని తొలిసారిగా పలుమార్లు స్టాక్ మార్కెట్ పెరుగుతుందని ఎన్నో సందర్భాల్లో చెప్పారని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పని ప్రధానికి సమాచారం ఉందని, అసలేం జరుగుతుందనేది ఐబీ డేటా, పార్టీ గణాంకాలు ఆధారంగా ఆయనకు తెలునని రాహుల్ పేర్కొన్నారు.

## ఇవాళ, రేపు హైదరాబాద్‌లో భారీ వర్షాలు.. జర జాగ్రత్త..!

హైదరాబాద్, జూన్ 6 :తెలంగాణకు నైరుతి రుతుపవనాలు విస్తరించడంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. భారీ వర్షానికి నగరం అతలాకుతలమైంది. గంటల తరబడి వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి.

గురువారం మధ్యాహ్నం సమయంలో కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఇవాళ రాత్రికి కూడా నగరంలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నగరవాసులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రేపు కూడా హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇతర జిల్లాల్లో కూడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. నిన్న సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో రాత్రంతా వాన పడింది. ఈ జిల్లాల్లో 170 నుంచి 180 మి.మీ. మధ్య వర్షపాతం నమోదైంది.

## తిరుచానూరు పద్మావతి ఆలయంలో ఆర్జితసేవలు రద్దు



తిరుపతి, జూన్ 6 :తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల సందర్భంగా ఆర్జిత సేవల ను రద్దు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. జూన్ 17 నుంచి 21వ తేదీ వరకు ఐదు రోజుల పాటు తెప్పోత్సవాలు జరుగనున్నాయని వివరించారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

జూన్ 17న మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు సుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారని వెల్లడించారు. జూన్ 20న రాత్రి 8.30 గంటలకు గజవాహనం, 21న రాత్రి 8.30 గంటలకు గరుడ వాహనసేవను ఘనంగా నిర్వహించనున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం ఊంజల్‌సేవ, జూన్ 21న లక్ష్మి పూజను రద్దు చేశామని పేర్కొన్నారు.

## ప్రధానికి కుటుంబాన్ని పరిచయం చేసిన పవన్ కల్యాణ్



అమరావతి, జూన్ 6 :ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి. జనసేన, బిజెపి కూటమి జయకేతనం ఎగురవేసిన ఈ క్రమంలో ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. తాజాగా జరిగిన ఎన్డీయే కూటమి నేతల సమావేశానికి తన కుటుంబంతో సహా హాజరయ్యారు. సతీమణి అన్నాలెజినోవా కొణిదెలతో పాటు తన కుమారుడు అకీరా నందన్‌ను సైతం దిల్లీకి తీసుకెళ్లారు.

కూటమి నేతల భేటీ ముగిసిన అనంతరం ప్రధాని మోదీకి తన కుటుంబాన్ని పరిచయం చేశారు. ఈసందర్భంగా అకీరా ప్రధాని మోదీకి నమస్కరిస్తుండగా అతడి భుజంపై చేయి వేసి మోదీ మాట్లాడుతున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది.

## ఏపీ అసెంబ్లీకి ఎన్నికైన అభ్యర్థుల జాబితాను గవర్నర్‌కు అందజేసిన సీఈవో



అమరావతి, జూన్ 6 :ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా గవర్నర్ అబ్దుల్ నజీం ను గురువారం కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన అభ్యర్థుల జాబితాతో పాటు ఓటింగ్ వివరాలతో కూడిన నివేదికను అందజేశారు.

మొత్తం ఏపీలో 175 అసెంబ్లీ , స్థానాలకు, 25 పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు, వారిలో గెలిచిన అభ్యర్థులు, వారికి వచ్చిన ఓట్లు , పోలింగ్, ఓటింగ్ శాతం తదితర వివరాలతో తయారు చేసిన జాబితాను గవర్నర్‌కు అందజేశారు. షెడ్యూల్ వెలువడ్డ నాటి నుంచి నామినేషన్లు, విత్ డ్రాలు, స్క్రూటీన్, ఫైనల్‌గా పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అందజేశారు.

### నేటి కందం– నేటికీ అందం

మన వైజ్ఞానిక శక్తికి
మననీయ నిదర్శనముగ మన్నన లండన్
ఘనమైనయట్టి భాస్కర
వినువీధిన నిలిపె భరత విఖ్యాతి ధృతిన్
(7–6–1979 భాస్కర–1 ఉప గ్రహ ప్రయోగం)



–రాధశ్రీ
సెల్:9494481210

## సింగరేణిలో ఇకపై పాలన పరుగులు పెట్టాలి-సీఎండీ బలరాం ఆదేశాలు



హైదరాబాద్, జూన్ 6 :రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇకపై సింగరేణిలో పాలన పరుగులు పెట్టాలని సంస్థ సీఎండీ ఎన్ బలరాం సూచించారు. కోడ్ నేపథ్యంలో నిలిచిన సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగులకు అందించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. సంస్థ చేపట్టిన ప్రాజెక్టులు, కొత్త కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ విషయంలో అన్ని విభాగాలు సమన్వయంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి 25కు పైగా శాఖల అధిపతులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇప్పటి వరకు ఉత్పత్తి, రవాణాలపైనే నెలవారీగా సమీక్షలు నిర్వహించడం జరిగిందని.. ఇకపై ఇతర విభాగాల పనితీరుపైనా నెలవారీగా సమీక్ష నిర్వహించడం జరుగుతుందని సీఎండీ బలరాం తెలిపారు. ఆయా విభాగాలకు అప్పగించిన పనుల పురోగతిని నెలవారీగా తెలుసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ప్రస్తుతం ప్రైవేటు రంగంతో పోటీ పడేలా మన సామర్థ్యాలను, ఆలోచనా విధానాలను మార్చుకొని ముందుకు సాగాలని సూచించారు.

సింగరేణి వ్యాపార విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయని.. అందరు అధికారులు, ఉద్యోగులు తమ బాధ్యతలను సమర్థవంతంగాసకాలంలో నిర్వహించగలిగితే సంస్థను దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టవచ్చని సీఎండీ ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా పని గంటల వినియోగంతోపాటు మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం అత్యంత కీలకమని తెలిపారు. విధుల పట్ల అలసత్వం, లక్ష్య సాధన పట్ల నిర్లక్ష్యం చూపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఆయా విభాగాల పనితీరులో మెరుగుదల కనిపించకపోయినా.. అప్పగించిన పనులను పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. అదే సమయంలో సంస్థ ఉన్నతికి అంకిత భావంతో పనిచేసే వారికి మంచి గుర్తింపు ఇస్తామని తెలిపారు.

ఉత్పత్తితోపాటు సంక్షేమం, రక్షణకు యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రక్షణ విషయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగానికి ఖర్చుకు వెనకాడకుండా చర్యలు తీసుకుంటున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎండీ గుర్తు చేశారు. కంపెనీ అభివృద్ధికి ఇచ్చే మంచి సూచనలను స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు.

## నేటి నుంచి ప్రజావాణి మళ్లీ ప్రారంభం

హైదరాబాద్, జూన్ 6 :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం రేపటి నుంచి మళ్లీ ప్రారంభం కానున్నది. ఎన్నికల కోడ్ కారణంగా ప్రజావాణి నిలిపివేసిన విషయం తెలిసిందే.

కాగా, కోడ్ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కానున్నది. ప్రజాభవన్‌లో మంగళవారం, శుక్రవారాల్లో ప్రజావాణి కొనసాగనున్నది. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

## రిజర్వేషన్ల రద్దుపై ఎస్పీ దుష్ప్రచారంతో ప్రతికూల ఫలితాలు : యూపీ మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 6 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన ఫలితాలు రాకపోవడం, యూపీలో సీట్ల సంఖ్య తగ్గడంపై ఆ రాష్ట్ర మంత్రి దయాశంకర్ సింగ్ స్పందించారు. లక్నోలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందని సమాజ్‌వాదీ పార్టీ దుష్ప్రచారం సాగించిందని అన్నారు. రిజర్వేషన్ల రద్దుపై ఎస్పీ వదంతులు వ్యాప్తి చేయడంతో యూపీలో ఓటర్లపై అది ప్రభావం చూపిందని మంత్రి వ్యాఖ్యానించారు.

8.5 కిలోల ఉచిత రేషన్ అందిస్తామని ఎస్పీ ఇచ్చిన బూటకపు హామీలు కూడా ప్రజలను తప్పుదారి పట్టించాయని అన్నారు. దీనికి సంబంధించి తాము లోతుగా చర్చిస్తామని, ఫలితాలపై ఆత్మవిమర్శ చేసుకుంటామని చెప్పారు.

# సెల్ ఫోన్, సెల్ టవర్ రేడియేషన్ ప్రమాదకరమా !

(08 జూన్ 'ప్రపంచ మెదడు కణితి దినం' సందర్భంగా)

'జర్మన్ మెదడు కణితి సంఘం' ప్రేరణతో 08 జూన్ 2000న ప్రారంభమైన ప్రతి ఎటా 'ప్రపంచ మెదడు కణితి దినం (వరల్డ్ బ్రేయిన్ ట్యూమర్ డే)' నిర్వహించబడుతున్నది. మెదడు కణితి రోగులకు అవగాహన కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు సంఘీభావాన్ని ప్రకటించాల్సిన చక్కని సందర్భమిది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు 500లకు పైగా ప్రజలకు మెదడు కణితి సంబంధ కొత్త కేసులు బయట పడుతున్నాయి. పిల్లల్లో, ముఖ్యంగా బాలికల్లో మెదడు కణితి, కేంద్ర నాడీమండల కణితి సమస్యలు అధికంగా (పిల్లల కాన్సర్‌లో 26 శాతం) కనిపిస్తున్నాయి. మెదడు కణితి ముదిరి ప్రాణాంతక బ్రేయిన్ కాన్సర్‌గా కూడా మారవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారత్‌లో మెదడు కణితి సమస్య:

భారత్‌లో కూడా మెదడు కణితి కేసులు (లక్షలో 10 మందికి) అధికంగా బయట పడుతున్నాయి. భారత జాతీయ కాన్సర్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మెదడు కణితి సమస్య నిర్మూలన, నిర్ధారణ పరీక్షల నిర్వహణ, తొలి దశలో గుర్తించడం, నిర్ధారణానంతర వైద్యం లాంటి అంశాల్లో దృష్టి కేంద్రీకరించడం జరుగుతున్నది. శరీరంలో ఏదైన ప్రదేశంలో ప్రయోజనం లేని కణజాలం అపరిమితంగా, నియంత్రించలేకుండా పెరగడాన్ని కాన్సర్ లేదా కణితి లేదా ట్యూమర్ అంటాం. మెదడులో కణజాలం అసాధారణంగా, అపరిమితంగా పెరగడాన్ని 'బ్రేయిన్ ట్యూమర్'గా పిలుస్తారు. మెదడు కణితుల్లో 'మాలిగ్నెంట్' మరియు 'బెనైన్' అనబడే రెండు రకాలు ఉంటాయి.

రోగ కారణాలు/చికిత్సలు:

మెదడు కణితి సమస్య ఏ వయస్సు వారికైనా రావచ్చు. కణితి పరిమాణం, రకం, సోకిన భాగాన్ని బట్టి వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. బాలల్లో మెదుల్లోబ్లాస్టోమా, గ్లియోమా, ఆస్ట్రోసైటోమ, బ్రేయిన్ స్టెమ్ గ్లయోమా అనబడే మెదడు కణితి రకాలు కనిపిస్తాయి. అధిక ఎక్స్ రే కిరణాలు సోకడం, ప్రమాదకర రసాయనాల ప్రభావం, కుటుంబ చరిత్రలు కూడా మెదడు కణితి సమస్యకు కారణం కావచ్చు. దీర్ఘకాలం సెల్ ఫోన్ రేడియేషన్‌కు లోలైన వారికి కూడా మెదడు కణితి సమస్య రావచ్చు. మెదడు కణితి నిర్ధారణకు సిటి స్కాన్, యంఆర్ఐ పరీక్షలు చేస్తారు. మెదడు కణితి చికిత్సలో సర్జరీ, రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, స్టీరాయిడ్స్, ఆంటీ-సీజుర్ మెడికేషన్, వెంట్రిక్యులార్ పెరిటోనియల్ షంట్, వీటిలో కొన్నింటిని కలిపి కూడా ఏకకాలంలో వాడవచ్చు. తొలి దశలో గుర్తించినపుడు సరైన వైద్యంతో నయం అవుతుందని గమనించాలి.

రోగ లక్షణాలు:

మెదడు కణితి రోగ లక్షణాల్లో తల నొప్పి, దృష్టి సమస్య, వికారం, వాంతులు, మానసిక మార్పులు, నడక-మాట-స్పర్శ లోపం, తల తిప్పడం, మూర్ఛ పోవడం లాంటివి కనిపిస్తాయి. మెదడు కణితి సమస్యతో బాధపడే రోగులకు మానసిక ప్రశాంత కలిగించేలా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి. చరవాణి వాడకాన్ని తగ్గించడం, రేడియోషన్, రసాయనాలు, సెల్ టవర్లకు దూరంగా ఉండడం మంచిది.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మళ్లీ ఎన్నిక అయిన సందర్భంలో ఆయనకు అభినందనలను తెలిపిన అధ్యక్షుడు శ్రీ బైడెన్

న్యూఢిల్లీ, జూన్ 6 :యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యుఎస్ఎ) యొక్క అధ్యక్షుడు శ్రీ జోసెఫ్ బైడెన్ ఈ రోజు న టెలిఫోన్ ద్వారా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో మాట్లాడారు.

భారతదేశాని కి ప్రధాన మంత్రి గా చరిత్రాత్మకమైనటువంటి మూడో పర్యాయం తిరిగి ఎన్నిక అయినందుకు గాను ప్రధాన మంత్రి కి స్నేహపూర్ణ మైన అభినందనల ను అధ్యక్షుడు శ్రీ బైడెన్ వ్యక్తం చేశారు.

అధ్యక్షుడు శ్రీ బైడెన్ కు ధన్యవాదాల ను ప్రధాన మంత్రి పలుకుతూ, దీనిని ప్రజాస్వామ్యం యొక్క మరియు ప్రజాస్వామిక ప్రపంచం యొక్క గెలుపు గా పేర్కొన్నారు.

ప్రపంచ హితం కోసం భారతదేశం-యుఎస్ విస్తృత ప్రపంచస్థాయి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత గా బలపరచడం కోసం కలసి పని చేయడాన్ని కొనసాగించేందుకు ఇరువురు నేత లు అంగీకరించారు.

ప్రస్తుతం జరుగుతున్న ఐసిసి టి20 క్రికెట్ వరల్డ్ కప్ కు సఫల సహ- ఆతిథేయి గా ఉంటున్నందుకు యుఎస్ కు ప్రధాన మంత్రి తన శుభాకాంక్షల ను తెలియజేశారు.

ఇద్దరు నేత లు ఒకరి తో మరొకరు సంప్రదింపులు జరుపుకొంటూ ఉండాలని సమ్మతి ని వ్యక్తం చేశారు.

# క్రిందటి ఏడాది లో నేపాల్ ప్రధాని జరిపిన ఫలప్రద యాత్రను గుర్తుకు తీసుకు వచ్చిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జూన్ 6 :నేపాల్ యొక్క ప్రధాని రైట్ ఆనరబుల్ శ్రీ పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ'తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ టెలిఫోన్ ద్వారా సంభాషించారు. భారతదేశం లో ఇటీవల ముగిసిన సాధారణ ఎన్నికల లో మూడో పర్యాయం చరిత్రాత్మకమైనటువంటి విజయాన్ని అందుకొన్నందుకు గాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కి అభినందనల ను ప్రధాని శ్రీ పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' తెలియజేశారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ యొక్క నాయకత్వం లో భారతదేశం-నేపాల్ సంబంధాలు మరింత గా దృఢం అవుతాయన్న విశ్వాసాన్ని ప్రధాని శ్రీ పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' వ్యక్తం చేశారు.

ప్రధాని శ్రీ పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' కు ఆయన వ్యక్తం చేసిన శుభాకాంక్షల కు గాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ధన్యవాదాల ను పలికారు. క్రిందటి సంవత్సరం లో నేపాల్ ప్రధాని భారతదేశాని కి వచ్చిన సంగతి ని శ్రీ నరేంద్ర మోదీ ఆప్యాయం గా గుర్తు కు తీసుకు వస్తూ, ఆ కాలం లో ఇరు దేశాల మధ్య సాంప్రదాయక, మైత్రీపూర్వక మరియు బహుళ పార్శ్విక భాగస్వామ్యాన్ని మరింత దృఢం గా మలచడం కోసం అనేక కార్యక్రమాల ను తీసుకొన్నట్లు శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

# పరిశ్రమ 4.0 పరివర్తనలో ఎమ్ఎస్ఎమ్ఇలకు మరియు స్టార్ట్-అప్‌లకు మద్దతును ఇచ్చేందుకు ఒక కార్యక్రమాన్నిప్రారంభించిన డిఓటి

న్యూఢిల్లీ, జూన్ 6 :పరిశ్రమ లో క్రొత్త గా ఉనికి లోకి వస్తున్న సాంకేతికతల ను అక్కున చేర్చుకొనే మాధ్యం ద్వారా సంస్థల కు మరియు స్టార్ట్-అప్స్ కు సాయపడాలనే ఉద్దేశ్యం తో టెలికమ్యూనికేశన్స్ విభాగం (డిఓటి) ఒక క్రొత్త కార్యక్రమానికి పథక రచన ను చేస్తున్నది. "ఇండస్ట్రి 4.0 ఎ బేస్ లైన్ సర్వే అమంగ్ ఎమ్ఎస్ఎమ్ఇ స్" అనే ప్రతిపాదన తో ముందుకు రావాలని డిఓటి పిలుపునిచ్చింది. ఈ ప్రతిపాదన డిజిటల్ పరివర్తన ను ప్రోత్సహించేదిగాను మరియు 5జి, ఇంకా 6జి సాంకేతికత ల రాకడ కోసం పరిశ్రమల ను సన్నద్ధం చేసే విస్తృతమైన విజన్ తో ఉండాలని పేర్కొనడమైంది.

ఇండస్ట్రి 4.0 కు తగిన విధం గా మారడం లోను మరియు ఆధునిక సాంకేతికతల ను ఉపయోగించడం లోను ఎమ్ఎస్ఎమ్ఇ లకు ఎదురయ్యే సవాళ్ళ ను అవగాహన చేసుకోవాలి అనేది ఈ సర్వేక్షణ యొక్క లక్ష్యం గా ఉంటుంది. ఎఐ, ఐఓటి, క్లౌడ్ కంప్యూటింగ్, 5జి మరియు 6జి నెట్ వర్క్ ల ఏకీకరణ ద్వారా సమకూరే శక్తి యుక్తుల తో లాభపడడం లో దక్షత కలిగినటువంటి ఒక బలమైన ఇకోసిస్టమ్ కు రంగాన్ని సిద్ధం చేయాలనేది ఈ సర్వేక్షణ పరమోద్దేశ్యం గా ఉంది. కనీసం పది రంగాల లో రంగం వారీ అవసరాల తో పాటు ప్రాథమ్యాల ను గుర్తించడం, ఎమ్ఎస్ఎమ్ఇ ల యొక్క వైవిధ్య భరితమైన ముఖచిత్రాన్ని దృష్టిలో పెట్టుకొని నూతన ఆవిష్కారాల ను, స్పర్థాత్మకత ను సమర్థించడం వంటి అంశాలు దీనిలో భాగం గా ఉంటాయి.

సర్వేక్షణ 60 రోజుల లో భారతదేశం లో ఉత్తరాది మరియు దక్షిణాది ప్రాంతాల లోని అయిదేసి రంగాల ను లెక్క లోకి తీసుకొంటుంది. కీలకమైన సిఫారసు లు ఇండస్ట్రి 4.0 తాలూకు పరివర్తన పూర్వక విధానాల ను అవలంబించేటందుకు విధాన పరం గా తీసుకోబోయే నిర్ణయాల కు ఒక వేదిక ను సమకూర్చనుంది; తద్వారా ఎమ్ఎస్ఎమ్ఇ లలో పోటీ తత్వం మరియు మనుగడ లలో వృద్ధి చోటుచేసుకొంటుంది.

సంస్థ లు మరియు స్టార్ట్-అప్ స్ ఈ మార్పు ప్రధానమైనటువంటి సర్వేక్షణ లో పాలుపంచుకోవడం కోసం 2024 జూన్ 11 వ తేదీ కల్లా వాటి వాటి ప్రతిపాదనల ను సమర్పించాలి అని ఆహ్వానించడమైంది. ప్రతిపాదన ను సమర్పించడానికి అవసరమైన మార్గనిర్దేశకాలు మరియు మరిన్ని వివరాల ను ఈ క్రింద ఇచ్చిన లింకు ను చూసి తెలుసుకోవచ్చును.

# 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 6 :ప్రపంచ పర్యావరణ దినం సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారు. శ్రీ నరేంద్ర మోదీ దిల్లీ లోని బుద్ధ జయంతి పార్కు లో ఒక రావి మొక్క ను నాటారు. మన భూ గ్రహాన్ని మెరుగైంది గా మలచడం లో అందరు వారి వంతు తోడ్పాటు ను అందించవలసింది అంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. గడచిన పది సంవత్సరాల లో భారతదేశం చేపట్టిన అనేక ఉమ్మడి ప్రయాస లు దేశం లో అటవీ ప్రాంత విస్తీర్ణం పెరిగేందుకు దారితీశాయి అని ఆయన అన్నారు. స్థిరమైన అభివృద్ధి దిశ లో మనం పడుతున్న తపన లో ఇది ఒక మహత్కార్యం అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

"ఈ రోజు న, ప్రపంచ పర్యావరణ దినం నాడు, ('ఏక్ పేడ్ మా కే నామ్') ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నందుకు సంతోషం గా ఉంది. భారతదేశం లో మరియు ప్రపంచ దేశాల లో ప్రతి ఒక్కరిని రాబోయే రోజుల లో మీ మాతృమూర్తి కి ఒక ప్రశంస గా ఒక మొక్క ను నాటండి అంటూ నేను పిలుపును ఇస్తున్నాను. మొక్క ను నాటుతున్నప్పటి పంచుకోగలరు."

"ఈ రోజు న ఉదయం పూట, నేను మన ప్రకృతి మాత ను పరిరక్షించడం పట్ల మన నిబద్ధత కు అనుగుణం గా ఒక మొక్క ను నాటాను; మీరందరు కూడ మన భూగ్రహాన్ని మెరుగైందిగా మలచడం కోసం మీ వంతు తోడ్పాటు ను అందించాలి అని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

"గడచిన దశాబ్దం లో, దేశం అంతటా అటవీ ప్రాంత విస్తీర్ణాన్ని పెంచడం లో దోహదపడ్డ అనేక ఉమ్మడి ప్రయాసల ను భారతదేశం చేపట్టింది అనే విషయం మీ అందరి ని సంతోష పరచేదే. స్థిర అభివృద్ధి దిశ లో మనం పడుతున్న తపన లో ఇది ఒక గొప్ప విషయం. స్థానిక సముదాయాలు సందర్భానికి తగినట్లు చొరవ తీసుకొని ఈ విషయం లో నాయకత్వ భూమిక ను పోషించాయనేది సైతం ప్రశంసనీయం గా ఉంది."

# ఎంపీ, ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు



ఖమ్మం, జూన్ 6 :(నేటినిజం ప్రతి నిధి): ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేతలు మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ ను, డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్ ని మర్యాద పూర్వకంగా కలసి ఇరువురిని శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. గురువారం డోర్నకల్ లోని వారి నివాసంలో కలిసి ఇటీవల వెలువడిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు, తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పై ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కమతం రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బలరాం నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 8, 9 తేదీల్లో చేప ప్రసాదం పంపిణీ .. ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 6 :నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 8, 9 తేదీల్లో చేప ప్రసాదం పంపిణీ జరగనుంది.

ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల నుంచి నాంపల్లికి ప్రత్యేక బస్సులు నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఎయిర్‌పోర్టు నుంచి బస్సులు అధిక సంఖ్యలో అందుబాటులో ఉండనున్నాయి.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి 9, జేబీఎస్ నుంచి 9, ఎంజీబీఎస్ నుంచి 9, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు నుంచి 9, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 7 బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. ఇక సిటీలోని పలు ప్రాంతాల నుంచి 80 ప్రత్యేక బస్సులు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు రాకపోకలు కొనసాగించనున్నాయి. దిల్‌సుఖ్‌నగర్ నుంచి 7, ఎన్జీవోస్ కాలనీ 7, మిథాని 7, ఉప్పల్ 7, చార్మినార్ 5, గొల్కొండ 5, రామ్‌నగర్ 5, రాజేంద్రనగర్ 7, రిసాలబజార్ 5, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ 5, పటాన్‌చెరు 5, కేపీహెచ్‌బీ కాలనీ 5, గచ్చిబౌలి నుంచి 5 బస్సులను నడపనున్నారు.

# ప్రదానమంత్రి రాజీనామా చేయాలని రేవంత్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

**– అతని వ్యాఖ్యలు గురివింద గింజ సాఎతను గుర్తు చేస్తున్నాయి**
**– బిజెపి మహిళా నేత మహబూబ్‌నగర్ ఎంపి డి.కే.అరుణ**

హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సొంత నియోజకవర్గం మహబూబ్‌నగర్‌ను గెలిపించుకోలేకపోయినముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రదానమంత్రి రాజీనామా చేయాలని వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉన్నాయని బిజెపి మహిళా నేత మహబూబ్‌నగర్ ఎంపి డి.కే.అరుణ ఎద్దేవా చేశారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికు డీకే అరుణ కౌంటర్ ఇచ్చారు. అతని వ్యాలు గురివింద గింజ సాఎతను గుర్తు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని సొంత పార్టీ నుంచే డిమాండ్ వస్తోందని చెప్పారు. నల్లగొండ, భువనగిరిని గెలిపించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ నుంచి రేవంత్ కు ఇబ్బంది తప్పదని హెచ్చరించారు. ప్రధానిగా ఉండకూడదని చెప్పడానికి రేవంత్ ఎవరు? అని ప్రశ్నించారు. 14స్థానాలు గెలుస్తామని.. కాంగ్రెస్ 8స్థానాలే గెలవటంపై రేవంత్ ఏమంటారు? అని నిలదీశారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రజలు గుర్తించటం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోకుంటే ఇబ్బంది పడతారని డీకే అరుణ పేర్కొన్నా రు.కేంద్రమంత్రి పదవి కోసం తాను ప్రయత్నాలు చేయనని.. పార్టీ నిర్ణయం తీసుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ సంచలన విజయం కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. వంశీచందర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయనపై డీకే అరుణ(3,510) ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

# ఈటెల రాజేందర్, రఘునందన్ రావులకు ఘన సన్మానం



హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);లోక్ సభ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిన ఈటెల రాజేందర్, మెదక్ పార్లమెంటు స్థానం నుంచి భారీ విజయం సాధించిన రఘునందన్ రావు లను బిజెపి పార్టీ రాష్ట్ర కార్యాలయం లో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. చిత్రం లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# హస్తినకు క్యూ కట్టిన బీజేపీ నేతలు



న్యూఢిల్లీ, జూన్ 6 :హస్తినకు తెలంగాణ బీజేపీ నేతలు వెళుతున్నారు. ఎంపీలుగా విజయం సాధించిన బండి సంజయ్, డీకే అరుణ, రఘునందన్?రావు తదితరులు ఢిల్లీకి బయలుదేరారు. రేపు ఢిల్లీలో ఎన్డీఏ ఎంపీల సమావేశం జరగనుంది. ఇప్పటికే ఢిల్లీలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్ తదితరులున్నారు. ప్రస్తుతం మోదీ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశం జరిగింది. శుక్రవారం ఎంపీలుగా గెలుపొందిన పార్టీ నేతలతో మోదీ సమావేశం కానున్నారు. అనంతరం మిత్రపక్షాల నేతలు వేరుగా భేటీ అవుతారు.

మంత్రివర్గంలో ఎవరెవరు ఉండాలి.. ఏ పార్టీకి ఎన్ని పదవులివ్వాలో ఈ భేటీలో చర్చించనున్నారు. రాజకీయ అనిశ్చితికి ఆస్కారం లేకుండా త్వరత్వరగా ఈ ప్రక్రియ ముగించాలని టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నితీశ్ గట్టిగా సూచించినట్లు ఎన్డీఏ వర్గాలు తెలిపాయి. కాగా, ప్రస్తుతం మోదీ కేబినెట్‌లో ఉన్న పలువురు మంత్రులకు ఉద్వాసన తప్పదని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఈసారి హోంశాఖ కాకుండా వేరే శాఖను కేటాయించవచ్చన్నట్టు ప్రచారం జరుగుతోంది. టీడీపీ, జేడీయూ ఎంపీలకు కీలక మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నాయని ఎన్డీఏ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. మోదీ కేబినెట్‌లో చేరాలని తమ పార్టీ నిర్ణయించినట్లు చంద్రబాబు వెల్లడించారు.

# ఏపీ అసెంబ్లీని రద్దు చేస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ

అమరావతి జూన్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఏపీ అసెంబ్లీని రద్దు చేస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆర్టికల్ 174 ప్రకారం మంత్రివర్గ సిఫార్సు మేరకు 15వ శాసనసభను రద్దు చేస్తూ నోటిఫికేన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితా ల్లో అధికార వైసీపీ ఘోర ఓటమిపాలు కావడంతో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మంగళవారం రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం నాడు అసెంబ్లీని రద్దు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. 15వ శాసన సభకు ఏపీలో 2019 ఏప్రిల్ 11న ఎన్నికలు జరుగగా మే 23న ఫలితాలు వెలువడ్డాయి . ఈ ఫలితాల్లో వైసీపీ పార్టీ వైఎస్ జగన్ నాయకత్వంలో 175 సీట్లకుగాను 151 సీట్లు సాధించింది. దీంతో ఆయన మే 30 న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 16వ శాసన సభకు భారత ఎన్నికల కమిషన్ రెండు నెలల ముందుగానే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో గత నెల 13న ఎన్నికల జరుగగా ఈనెల 4న ఫలితాలను ప్రకటించారు. ఈ ఫలితాల్లో అధికార వైసీపీ ఓటమి చెందగా సీఎం పదవికి జగన్ రాజీనామా చేశారు. 16వ శాసన సభ త్వరలో కొలువుదీర నున్నది.

# దేశవ్యాప్తంగా ఫలించిన కాంగ్రెస్ సామాజిక న్యాయ సూత్రం..

**-నిర్ణయాత్మక శక్తిగా మారిన ఓబీసీ ఓటర్లు..**

హైదరాబాద్ జూన్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సామాజిక న్యాయ సూత్రం.. ఫలించినదని, నిర్ణయాత్మక శక్తిగా మారిన ఓబీసీ ఓటర్లు.. రాజ్యాంగ హక్కులు కోల్పోతున్నామనే భావనతో కాంగ్రెస్ కు వెన్నుదన్నుగా నిలిచారని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ అన్నారు.దేశరక్షణ,అభివృద్ధి,సంక్షేమంతో బాటు దేశ ప్రజలు సామాజిక న్యాయాన్ని కొరుకుంటున్నారు.. ఎన్నికల ఫలితాలతోనైనా బీజేపీ ఈ వాస్తవాన్ని గ్రహించాలని ఆయన పేర్కొన్నారు.18వ లోక్ సభ ఎన్నికల ఫలితాలలో ఓబీసీలు , అట్టడుగువర్గాల ప్రజలు రాజ్యాంగ రక్షణ, ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఇండియా కూటమికి అండగా నిలిచారని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.. దేశ రక్షణ,సుస్థిర అభివృద్ధితో బాటు ప్రజలు సామాజిక న్యాయాన్ని సైతం కొరుకుంటున్నారనీ.,ఈ ఎన్నికల ఫలితాలతోనైనా బీజేపీ ఈ వాస్తవాన్ని గ్రహించాలని బీజేపీ అధినాయకత్వానికి సూచించారు.. తెలంగాణలో బీసీల రాజకీయ ఎదుగుదలకు ప్రాధాన్యమిస్తామన్న హామీతో బీజేపీ గణనీయంగా పుంజుకున్నదనీ, 8 సీట్లకు ఎగబాకగలిగిందనీ తెలిపారు..కాంగ్రెస్ లోక్ సభ ఎన్నికలలో బీసీలకు తక్కువ సీట్ల కేటాయింపు, అసెంబ్లీ సీట్ల కేటాయింపు విషయంలో ఉదయపూర్ డిక్లరేషన్ కు తిలోధకాలియ్యడం తదితర అంశాలు 14 సీట్లను సాధించడానికి ప్రతిబంధకాలుగా నిలిచాయని పేర్కొన్నారు.దేశవ్యాప్త సమగ్ర కులగణన, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు,మహిళా కోటాలో బీసీమహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ల సాధన, స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ల పెంపు , సామాజిక న్యాయం కోసమే తమ భవిష్యత్ ఉద్యమాలను బలోపేతం చేస్తామన్నారు.. సబ్బండ వర్గాలు అధికారంలో భాగస్వాములయ్యి సాధికారతను సాధించే దిశగా దేశవ్యాప్తంగా ప్రయత్నాలను ముమ్మరం చేస్తామని తెలిపారు.


VURIMALLA FOUNDATION REGD. NO 228 OF 2019

వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ సంయుక్త ఆధ్వర్యంలో....

జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు – 2024

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలు :
- కథ చేతిరాతలో 5 పేజీలకు మించరాదు. డి.టి.పి. చేసినచో 3 పేజీలకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

నిబంధనలు :

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలు :
- కవిత 25 లైన్లకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

2024 సంవత్సరానికి గాను "వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ" సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి కథలు, కవితలు పోటీలు నిర్వహించనున్నారు.

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 5000/-, ద్వితీయ బహుమతి రూ. 4000/-, తృతీయ బహుమతి రూ. 3000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 4000/-, ద్వితీయ బహుమతి రూ. 3000/-, తృతీయ బహుమతి రూ. 2000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిలో ఒకరికి "భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ" గార్ల సాహితీ పురస్కారంతో పాటు రూ. 10,000/- నగదు బహుమతి అందజేయబడుతుంది.

కవితలు, కథలు పంపాల్సిన చివరి తేది : 30 జూన్ 2024

కథలు, కవితలు పంపాల్సిన చిరునామా :
రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001. సెల్ : 98492 77968

పూర్తి వివరాలకు : వురిమళ్ల పౌండేషన్ వ్యవస్థాపకురాలు : వురిమళ్ల సునంద, సెల్ : 9441815722

# మోడీ గ్యారంటీని దేశ ప్రజలు తిరస్కరించారు

**-ప్రధాని పదవికి తక్షణమే మోడీ రాజీనామా చేయాలి**
**-తన సొంత జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి తనదే బాధ్యత**
**-వచ్చిన ఫలితాలు ఉగాధి పచ్చడిలాంటివి**
**-వంద రోజుల పాలన తరువాత 41 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు వచ్చాయి**
**-కాంగ్రెస్ పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారు**
**-బిఆర్ఎస్ నేతలు అవయవదానం చేసి ఏడు సీట్లలో బిజెపిని గెలిపించారు**
**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్**

హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కేంద్రంలో 2014, 2019లో బిజెపికి పూర్తి మెజార్టీ ఇచ్చారని, 2024 ఎన్నికల్లో మోడీ గ్యారంటీని దేశ ప్రజలు తిరస్కరించారని, మోడీ కాలం చెల్లిందని ప్రజలు తీర్పు ఇచ్చారని, ప్రధాని పదవికి తక్షణమే మోడీ రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తన నివాసంలో రేవంత్ మీడియాతో మాట్లాడారు. మూడోసారి కూడా మోడీ ప్రధాని పదవి చేపడితే విలువలతో కూడి రాజకీయాలు చేయనట్టేనని ఎద్దేవా చేశారు. తాను జిల్లాకు ముఖ్యమంత్రిని కాను అని, గెలుపు ఓటములకు తానే బాధ్యుడిగా వ్యవహరిస్తానని, తన సొంత జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి తనదే బాధ్యత అని రేవంత్ స్పష్టం చేశారు.

వచ్చిన ఫలితాలు ఉగాధి పచ్చడిలాంటివని, రాష్ట్రానికి పరితమైన నాయకుణ్ణి, తన బాధ్యత రాష్ట్రానికే పరిమితమవుతుందన్నారు. మెదక్‌లో కాంగ్రెస్‌కు చెందిన బిసి అభ్యర్థిని ఓడించారని, గత ఎన్నికల్లో బిఆర్ఎస్ వచ్చిన ఓట్ల శాతాన్ని బిజెపికి బదిలీ చేశారని, 22 శాతం ఉన్న బిఆర్ఎస్ ఓట్లను హరీష్ రావు బిజెపికి బదిలీ చేశారని, 2001 నుంచి 2023 వరకు సిద్దిపేటలో బిఆర్ఎస్‌కు భారీ మెజార్టీ వచ్చిందని, బిఆర్ఎస్ ఓటింగ్ శాతం 16.5 శాతానికి పడిపోయిందని, తెలంగాణలో వంద రోజుల్లో గ్యారెంటీలను అమలు చేశామని రేవంత్ వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నచ్చితే ఓటు వేయాలని లోక్ సభ ఎన్నికల్లో ప్రజలను అడిగామని, రాష్ట్రంలో 8 మంది కాంగ్రెస్ ఎంపి అభ్యర్థులు గెలిచారని, వంద రోజుల పాలన తరువాత 41 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు వచ్చాయని, అసెంబ్లీ ఓట్ల శాతం కంటే ఎక్కువగా లోక్ సభ ఎన్నికల్లో వచ్చాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తాము భావిస్తున్నామని, ఎనిమిది ఎంపి సీట్లు గెలిపించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

2019లో కాంగ్రెస్‌కు మూడు ఎంపి సీట్లు వస్తే ఇప్పుడు 8 ఎంపి సీట్లు గెలిచామని, బిఆర్ఎస ఏడు సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందన్నారు. ఏడు సీట్లలో బిజెపిని గెలిపించి బిఆర్ఎస్ నేతలు అవయవదానం చేశారని, బిఆర్ఎస్ నుంచి బలహీన అభ్యర్థులను పెట్టి బిజెపి నేతలు గెలుపు కోసం కెసిఆర్ కృషి చేశారని, మెదక్‌లో కాంగ్రెస్‌కు చెందిన బిసి అభ్యర్థిని ఓడించారని, గత ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు వచ్చిన ఓట్ల శాతాన్ని బిజెపికి బదిలీ చేశారని మండిపడ్డారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రభుత్వం వచ్చినా సామరస్యంగానే సమస్యలు పరిష్కరించుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారానికి ఆహ్వానిస్తే తప్పకుండా వెళ్తానని, ఉమ్మడి రాజధాని హైదరాబాద్ చట్టపరంగా తేలిపోయిందని, హైదరాబాద్ ఇప్పుడు తెలంగాణకు సంపూర్ణ రాజధాని అయిందన్నారు.

# మరింత బాధ్యతతో జనసేన ఎంఎల్ఏలు కలిసి పని చేయాలి

**-ఓటేసిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి**
**-జనసేన అధినేత పవన్ కల్యాణ్ హితవు**

అమరావతి జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మరింత బాధ్యతతో జనసేన ఎంఎల్ఏలు కలిసి పని చేయాలని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన పార్టీ నుంచి గెలిచిన అభ్యర్థులతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. గెలిచిన అభ్యర్థులను పవన్ అభినందించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. ఓటేసిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జనసేన నూటికి నూరు శాతం విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. వైసిపిపై కక్ష సాధింపు చర్యలుండవని, వ్యవస్థల్లో రాజకీయ ప్రమేయం తగ్గిస్తామని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బలమైన పునాదులు నిర్మించేలా కూటమి పాలన ఉంటుందని పవన్ వివరించారు. చీకటి రోజులు పోయాయని, కలిసికట్టుగా పనిచేసే రోజులు వచ్చాయని తెలియజేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితోనే మాదిగలు

**- తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ**



హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితోనే మాదిగలు ఉంటారని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ తెలిపారు. బుధవారం హైదరాబాదులోని బాగ్ లింగంపల్లి సామాజిక భవన్లో తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమాసమావేశం లో మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినటువంటి మహాకూటమి వివిధ జిల్లాల రాష్ట్ర నాయకులకు నియోజకవర్గ మండల గ్రామస్థాయి కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో భారీ మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు అదేవిధంగా భవిష్యత్తులో మాదిగల సమస్యల పట్ల చిత్తశుద్ధితో గెలిచిన పార్లమెంటు సభ్యులందరూ పనిచేయాలని విజ్ఞప్తి చేస్తూ...ఈ గెలుపులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ఓట్లు వేసి అఖండ విజయాన్ని అందించిన ఓటర్ మహాశయులకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తూ ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో 10 సంవత్సరాల ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గారు కొనసాగుటకు మాదిగజాతి అండగా నిలబడాల్సిన అవసరం ఉందనిఅన్నారు.. ఈ కార్యక్రమంలో మహాకూటమి ప్రధాన సలహాదారులు సంగీత రాజలింగం మాదిగ రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాల ఇన్చార్జీలు బడుగుల బాలకృష్ణ మాదిగ, ఎన్ఎస్ రాజు మాదిగ,పుట్ట జంగన్న, చైతన్య మాదిగ శివరాజ్ మాదిగ, జంగిలి నాగరాజు మాదిగ, కళ్యాణ్ ప్రేమ్ రాజ్, టి .లక్ష్మణ్ మాదిగ,బాలరాజు మాదిగ, బాలస్వామి మాదిగ, గడ్డం రాజేష్ మాదిగ, లక్ష్మణ్ దక్కలి, వెంకటేష్ దక్కలి, కే రాజు మాదిగ, బందెల యాదగిరి మాదిగ, ఏసు మాదిగ, రాష్ట్ర మీడియా కన్వీనర్ సుంచు లింగన్న మాదిగ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆయన ఓడిపోవాలని! కోటి మొక్కులు మొక్కారు



అమరావతి, జూన్ 6 :ఆయన ఓడాల్సిందే.. ఓడి తీరాల్సిందే. మేం ఓడిస్తాం? ఇలా పంతం పట్టింది తెలుగు తమ్ముళ్లే.. సొంత పార్టీ అభ్యర్థి అపజయానికి కంకణం కట్టుకుని మరీ ప్రచారం కూడా చేశారు. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇది మాత్రం వాస్తవమే.. నిజం కూడా. ఎందుకంటే ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఓ అపనమ్మకం ఉంది. చాలాకాలంగా వస్తున్న సెంటిమెంట్ అని కూడా చెప్పుకోవచ్చు. దాంతో ఆ సెగ్మెంట్‌లో సొంతపార్టీ అభ్యర్థి ఓడిపోవాలని కోటి దేవుళ్లకు నూటొక్క మొక్కులు మొక్కారు.

ఈ సెంటిమెంట్‌తో టీడీపీ నేతలు తెగ భయపడ్డారు. ఆయన గెలిస్తే అధికారం దక్కదని వణికి పోయారు.. ఈ సెంటిమెంట్ ఏళ్లకు ఏళ్లుగా వస్తోంది. ఇంతకూ ఇలాంటి విచిత్రమైన సీన్ ఎక్కడ చోటు చేసుకుంది? కరడుకట్టిన తెలుగుదేశం అభిమాని సైతం ఓడిపోవాలనుకున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎవరంటే పయ్యావుల కేశవ్. అందరిది ఒక దారి అయితే.. పయ్యావుల పరిస్థితి మరోలాంటిది. ఆయనకు వచ్చిన కష్టం ఇంకెవరికీ రాకూడదు. ఉరవకొండ స్థానం నుంచి పయ్యావుల గెలిచిన ప్రతిసారి టీడీపీ ప్రతిపక్షానికే పరిమితమైందనేది చాలామంది లీడర్ల వాదన.

ఉరవకొండలో అందులో పయ్యావుల కేశవ్ గెలిస్తే.. తెలుగుదేశం పార్టీ ఓడిపోతుందని.. అధికారం చేజారుతుందని ఒక బలమైన సెంటిమెంట్ ఉంది. ఈ కారణంగా పార్టీని అమితంగా ఆరాధించే వారు మొదలు పార్టీ కార్యకర్త వరకు పయ్యావుల కేశవ్ మాత్రం ఎన్నికల్లో ఓడిపోవాలని ప్రార్థించినట్టు తెలుస్తోంది. దీనికి కారణం ఒక సీటు పోయినా.. పార్టీ అధికారంలోకి వస్తుందన్న ఆశ వారికి ఉండడమే. అందుకే ఓడాలని కోటి మొక్కులు మొక్కారు? కనిపించిన ప్రతి ఆలయం మెట్లెక్కారు.. పూజలు, అర్చనలు, మోకాళ్లపై నడవడాలు చేసేశారు.. ఇక నియోజకవర్గంలోనూ వ్యతిరేక ప్రచారమూ చేసినట్టు తెలుస్తోంది.

పార్టీపై పయ్యావుల కమిట్‌మెంట్ క్వశ్చన్ చేయలేనిది. కంచు కంఠం.. ప్రత్యర్థులపై విరుచుకుపడే తీరు.. ఆయన ప్రశ్నించే వైనం అందరినీ ఆకట్టుకుంటాయి. తెలుగుదేశం పార్టీలో సబ్జెక్టు మాట్లాడే అతికొద్ది మంది నేతల్లో పయ్యావుల కేశవ్ ఒకరు. అలాంటి లీడర్‌ని ఎన్నికల్లో ఓడిపోవాలని తెలుగుదేశం పార్టీకి చెందిన వారంతా కోరుకున్నారు. ఆ మాటకు వస్తే దేవుడికి ప్రార్థనలు చేశారు. ఇదంతా వినేందుకు.. చదివేందుకు బాగానే ఉన్నా.. దాన్ని అనుభవించే వారి మానసిక పరిస్థితి గురించి ఆలోచించినప్పుడు మాత్రం అయ్యో అనుకోకుండా ఉండలేం. సుదీర్ఘకాలంగా పార్టీలో ఉండి శాపగ్రస్త జీవితాన్ని ఆయన అనుభవించారు. అధికారం రాకపోవడంతో మంత్రి పదవి కూడా దక్కింది లేదు.

అయితే.. విధి చాలా విచిత్రమైనది. ఏళ్లకు ఏళ్లుగా నడుస్తున్న సెంటిమెంట్ కారణంగా తన పొలిటికల్ కెరీర్‌లో తీవ్రంగా నష్టపోయిన పయ్యావులకు ఎట్టకేలకు శాపవిమోచనం జరిగినట్లుగా తాజా ఫలితం కనిపిస్తోంది. ఈ సెంటిమెంట్ విషయంలో తానేమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండేవారు కేశవ్. దీనికి తోడు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఓడిపోయి ఉండటం కారణంగా.. సరైన అవకాశం ఇప్పటివరకు దక్కలేదు. తాజా ఎన్నికల ఫలితం పుణ్యమా అని.. ఇంతకాలం నడిచిన నమ్మకం సడలిపోయింది. ఆయనపై ఉన్న శాపం తొలిగిపోయింది. పయ్యావుల కేశవ్ గెలిచారు. పార్టీ చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో.. తెలుగుదేశం అభిమానుల్లో సంతోషం నెలకొంది. ఎందుకుంటే.. ఎంతటి గడ్డు పరిస్థితుల్లోనూ పార్టీని వీడిపోకుండా.. నిస్వార్థంగా పోరాడిన పయ్యావులకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయని చాలామంది అంటున్నారు.

# 7 లోక్ సభ నియోజకవర్గాల్లోనూ డిపాజిట్ కోల్పోయిన బిఆర్ఎస్

హైదరాబాద్, జూన్ 6 : కె. చంద్ర శేఖర్ రావు నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ లో సీటు గెలువకపోవడమే కాదు, డిపాజిట్ ను కూడా కోల్పోయింది. అంతే కాదు ఇతర ఏడు లోక్ సభ నియోజకవర్గాల్లో కూడా డిపాజిట్టు కోల్పోయింది. తెలంగాణలో 17 పార్లమెంటరీ నియోజకవర్గాలుండగా 14 నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితం అయింది. మరో రెండు నియోజకవర్గాల్లో రెండో స్థానానికి, హైదరాబాద్ లో నాలుగో స్థానానికి పరిమితమైంది.బిఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిన లోక్ సభ నియోజకవర్గాలు ఇవి: 1. ఆదిలాబాద్, 2.నిజామాబాద్, 3.జహీరాబాద్, 4.మల్కాజ్ గిరి, 5.సికింద్రాబాద్, 6. హైదరాబాద్, 7. చెవెళ్ల, 8.మహబూబ్ నగర్.

# బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి-ఎమ్మెల్యే శ్రీహరి




మహబూబ్‌నగర్, జూన్ 6 :బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఇవాళ మక్తల్ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన బడిబాట ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ అంగన్వాడీ టీచర్లు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లు పంచాయతీ సెక్రెటరీ లకు ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తల్లిదండ్రులకు వీటి గురించి వివరించి చెప్పాలని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ప్రణాళిక ప్రకారం జూన్ 6వ తేదీ నుండి 19 తేదీ వరకు ప్రతిరోజూ ప్రతి గ్రామంలో అధికారులతో పాటు పాఠశాల కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ప్రతి ఇంటిని సందర్శించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, జిహెచ్ఎం, నోడల్ అధికారి అనిల్ గౌడ్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాసర అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి..




ఆదిలాబాద్, జూన్ 6 :నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సేవలో ఇవాళ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలయ ఈఓ విజయరామరావు, ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలోని నిత్య చండీ హోమం పూజలో పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకొని అర్చకులు ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహింపజేసీ హారతినిచ్చారు. ఆశీర్వచన మండపం లో హైకోర్టు న్యాయమూర్తి దంప తులను, ఆలయ ఈఓ విజయరా మరావు, ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆశీర్వదించి శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. వీరి వెంట ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణా రాష్ట్రంలో భవిష్యత్ అంతా బిజెపిదే

**- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షుడు కిషన్ రెడ్డి**

న్యూ డిల్లీ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స);తెలంగాణలో బిజెపి తన బలాన్ని రోజు రోజుకూ పెంచుకుంటోందని ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిందని.. కాంగ్రెస్ ను ప్రజలు నమ్మడంలేదని చెప్పారు.

రాష్ట్రంలో భవిష్యత్ అంతా బిజెపిదేనని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని అన్నారు.ప్రతి ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం పెరుగుతూ వస్తోందని.. బీఆర్ఎస్ ను వద్దనుకొని బీజేపీకి ఓటేశారని చెప్పారు. తెలంగాణలో 8సీట్లు గెలిచుకున్నామని? ఏడు సీట్లలో రెండో స్థానంలో ఉన్నామని తెలిపారు. చాలా చోట్లు బీఆర్ఎస్ కు డిపాజిట్లు కూడా రాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం మహబూబ్ నగర్ లో కూడా బీజేపీ గెలిచిందని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ పనిచేస్తుందన్నారు అని కిషన్ రెడ్డి అన్నారు.

# రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కలిసిన ఎంపీ గోడం నగేష్..



ఆదిలాబాద్, జూన్ 6 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిని ఢిల్లీలోని ఆయన నివాస గృహంలో పార్లమెంట్ సభ్యునిగా గెలిచిన గోడెం నగేష్ గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కిషన్ రెడ్డికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జి.నగేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముస్తాపూరే అశోక్ పుష్పగుచ్చం అందించి సికింద్రాబాద్ నియోజవర్గం నుండి మరోసారి గెలిచినందుకు అభినందనలు తెలిపారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుండి భారీ మెజారిటీ సాధించిన గోడెం నగేష్ ను కిషన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించగా, పార్టీ కార్యకర్తలు ప్రణాళికా బద్ధంగా అంకితభావంతో పనిచేసి మోడీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వల్లే విజయం సాధ్యమైందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ వివరించారు. కిషన్ రెడ్డి నివాస గృహంలో ఏర్పాటు చేసిన విందులో అదిలాబాద్ బీజేపీ జిల్లా నేతలు పాల్గొన్నారు.

# ఘనంగా కోట రాంబాబు జన్మదిన వేడుకలు

**- శుభాకాంక్షలు తెలియజేసిన 5 మండలాల నాయకులు,ప్రముఖులు**



ఖమ్మం, జూన్ 6 :(నేటినిజం ప్రతినిధి): ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా.కోట రాంబాబు జన్మదిన వేడుకలను మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కోట రాంబాబు కేకు కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. విచ్చేసిన మధిర నియోజకవర్గ 5 మండలాల ముఖ్య నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు డా.కోట రాంబాబుకు శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్స్ తినిపించారు. ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, రాజకీయం గా అత్యున్నత స్థాయిలో డా.కోట రాంబాబు ఉండలాని వారందరు కోరారు.

# తన కుటుంబ సభ్యులే 22 మంది తనకు ఓట్లేయగా, తనకు కేవలం 4 ఓట్లే రావడమేమిటి

**-కోర్టును ఆశ్రయించిన కె.ఏ.పాల్**

అమరావతి జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అధికార యంత్రాంగం తనకు ఓట్లు పడకుండా పనిచేసిందని ప్రజా శాంతి పార్టీ చీఫ్ డాక్టర్ కె.ఏ.పాల్ ఆరోపించారు.

పోటీ చేసిన అభ్యర్థులతో ఎన్నికల అధికారులు సిసిటివి లింక్స్ షేర్ చేసుకోవడం లేదని కూడా ఆయన ఆరోపించారు.

కె.ఏ.పాల్ విశాఖపట్నం లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. తనకు తన కుటుంబ సభ్యుల సంఖ్య ఓట్లు కూడా రాకపోవడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. విచారణ జూన్ 6న జరుగనున్నది.పాల్ విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిది బూత్ లలో తనకు ఒక్క ఓటు కూడా రాలేదన్నారు. మురళీనగర్ లో 235 బూత్ లు ఉండగా తన కుటుంబ సభ్యులే తండ్రి, సోదరుడు, సోదరి వంటి వారందరి ఓట్లే 22 వరకు ఉంటాయని అన్నారు. కానీ తనకు వచ్చిన ఓట్లు మాత్రం 4 అన్నారు. ఇదేలా సాధ్యం అని ఆయన ప్రశ్నిస్తున్నారు.

మంగళవారం ఓట్ల లెక్కింపు జరిగినప్పుడు తాను లీడింగ్ లో ఉన్నట్లు పోలింగ్ అధికారులే తనకు తెలిపారని అన్నారు. తనకు ఓట్లు రాకుండా ఎవరో కుట్ర పన్నారని ఆయన భావిస్తున్నారు. రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయెూ ఊహించుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

# కంప్లీట్ హోమ్ లోన్‌ని ప్రారంభించిన ఎల్ అండ్ టి ఫైనాన్స్

హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రముఖ రిటైల్ ఫైనాన్షియర్‌లలో ఒకటైన ఎల్‌అండ్‌టి ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్‌టిఎఫ్), హైదరాబాద్ కస్టమర్‌లు తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి అవసరమైన అన్ని హంగులతో 'ది కంప్లీట్ హోమ్ లోన్'ని ప్రారంభించింది. 'ది కంప్లీట్ హోమ్ లోన్' డిజిటలైజ్డ్ ప్రాసెస్ ద్వారా డెడికేటెడ్ రిలేషన్‌షిప్ మేనేజర్‌తో అందించబడుతుంది మరియు హోమ్ డెకర్ ఫైనాన్స్ ఎంపికతో వస్తుంది.సౌకర్యవంతమైన నివాస స్థలం కోసం అవసరమైన గృహోపకరణాలను కొనుగోలు చేయడంలో సౌలభ్యం మరియు సౌకర్యాన్ని అందించడం హోమ్ డెకర్ ఫైనాన్స్ లక్ష్యం. డిజిటలైజ్డ్ ప్రాసెస్ సాంకేతిక జోక్యంతో లోన్ పొందే ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. మరియు డెడికేటెడ్ రిలేషన్‌షిప్ మేనేజర్ రుణ ప్రక్రియ అంతటా కస్టమర్‌కు సంప్రదింపుల పాయింట్‌గా పనిచేసి, సున్నితమైన మరియు సంతృప్తికరమైన అనుభవాన్ని అందిస్తుంది. ఈ సందర్భంగా ఎల్‌టిఎఫ్‌లో అర్బన్ ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజయ్ గార్యాలీ మాట్లాడుతూ, "హైదరాబాద్ మాకు కీలకమైన మార్కెట్, మరియు 'ది కంప్లీట్ హోమ్ లోన్' ప్రారంభించడం ద్వారా, మేము ప్రధానంగా కొత్త గృహాలను కొనుగోలు చేసేవారిని లక్ష్యంగా చేసుకున్నాము. నిర్మాణంలో ఉన్న మరియు సిద్ధంగా ఉన్న ఆస్తులకు రుణాలు. వినియోగదారుల ప్రవర్తనను అర్థం చేసుకోవడం ద్వారా, కస్టమర్‌లకు సమగ్ర పరిష్కారాన్ని అందించే లక్ష్యంతో పరిశోధన-ఆధారిత ప్రతిపాదన 'ది కంప్లీట్ హోమ్ లోన్'ను అందించడానికి మేము గర్విస్తున్నాము.

# అచ్చ గా సాయుధ బలగాల కోసమే ఉద్దేశించిన 'టెలి మానస్'సెల్ ను ఏర్పాటు చేయడానికి ఎంఒయు పై సంతకాలు

న్యూఢిల్లీ, జూన్ 6 :పుణె లోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్ లో రెండు సంవత్సరాల కాలాని కి గాను ఆరోగ్యం ఢ కుటుంబ సంక్షేమం ల మంత్రిత్వ శాఖ యొక్క జాతీయ టెలిమెంటల్ హెల్త్ హెల్ప్ లైన్ అయినటువంటి 'టెలి మానస్' యొక్క స్పెశల్ సెల్ ను ఒక ప్రయోగాత్మక ప్రాజెక్టు గా నిర్వహించడం కోసం ఆరోగ్యం ఢ కుటుంబ సంక్షేమం ల మంత్రిత్వ శాఖ (ఎంఒహెచ ఎఫ్‌డబ్ల్యు) కు మరియు రక్షణ మంత్రిత్వ శాఖ (ఎమ్ఒడి) కు మధ్య ఒక అవగాహన పూర్వక ఒప్పంద పత్రం (ఎంఒయు) పై సంతకాలు అయ్యాయి. ఈ ఎంఒయు పై ఆరోగ్యం ఢ కుటుంబ సంక్షేమం ల మంత్రిత్వ శాఖ యొక్క ఎఎస్ ఢ ఎమ్‌డి ఆరాధన పట్ నాయక్ గారు మరియు ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ శ్రీ దళ్ జీత్ సింహ్ లు సంతకాలు చేశారు.

ఈ ప్రత్యేకమైన టెలి మానస్ సెల్ ను ఆరోగ్యం ఢ కుటుంబ సంక్షేమం ల మంత్రిత్వ శాఖ యొక్క సీనియర్ అధికారుల సమక్షం లో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ శ్రీ అనిల్ చౌహాన్, పివిఎస్ఎమ్, యువైఎస్ఎమ్, ఎవిఎస్ఎమ్, ఎస్ఎమ్ మరియు విఎస్ఎమ్ 2023 డిసెంబరు 1 వ తేదీ నాడు పుణె లోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్ (ఎఎఫ్ఎమ్‌సి) లో ప్రారంభించారు.భారతీయ సైన్యం ఎదుర్కొంటున్న అద్వితీయమైన ఒత్తిడుల ను గుర్తిస్తూ, సాయుధ బలగాల లో టెలి– మెంటల్ హెల్త్ సర్వీసెస్ యొక్క ఆవశ్యకత స్పష్టమవుతున్నది. సాయుధ బలగాలు పనిచేసే వాతావరణం, సాంస్కృతిక పరమైన సవాళ్ళు, ప్రాంతీయ సంఘర్షణల కు సంబంధించిన ప్రత్యేకమైన ఒత్తిడి భరిత అంశాల ను పట్టి చూస్తే జవానుల మానసిక ఆరోగ్య సంరక్షణకై ఒక ప్రత్యేకమైన విధానం అవసరపడుతుంది. ఇప్పుడు ఈ ఎంఒయు పైన సంతకాలు పూర్తి కావడం ద్వారా సాయుధ దళాల ఉద్యోగుల మరియు వారి కుటుంబ సభ్యుల మానసిక ఆరోగ్యాన్ని, ఇంకా శ్రేయస్సు ను పరిరక్షించడం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుంది. మరి సాయుధ దళాల లబ్ధిదారుల కు ప్రత్యేకమైన సంరక్షణ నేరు గా అందే సౌలభ్యానికి పూచీపడినట్లు అవుతుం ది. అంతేకాక, వారి మానసిక ఆరో గ్యం సంబంధి అవసరాల ను వెంటనే, ప్రభావవంతమైన పద్ధతి లో తీర్చడం సాధ్యపడుతుంది. ఈ సందర్భం లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ శ్రీ దళ్ జీత్ సింహ్ మాట్లాడుతూ, సాయుధ దళ సిబ్బంది కోసం మానసిక స్వస్థత సంబంధి కౌన్సెలింగ్ అనే సేవ యొక్క అవసరం చాలా కాలం నుండి ఉ ండింది, మరి ఇప్పుడు, ఒక ప్రత్యేకమైనటువంటి టెలి మానస్ సెల్ సాయం తో సాయుధ దళ ఉద్యోగుల కు మరియు వారి కుటుంబాల కు కీలకమైన మానసిక స్వస్థత సంబంధి సహాయాన్ని వారం లో ప్రతి రోజు 24 గంటల ప్రాతిపదిక న అందుకోనున్నారు. దీనితో, మానసిక ఆరోగ్యం పరం గా వారికి ఎదురయ్యే ఆందోళనల ను ఎంతో ప్రభావవంతమైన రీతి లో దూరం చేసుకోవడం లో తోడ్పాటు లభించనుంది అని పేర్కొన్నారు.

ఇదే కార్యక్రమం లో, ఎమ్ఒహెచ్ఎఫ్‌డబ్ల్యు యొక్క ఎఎస్ ఢ ఎమ్‌డి ఆరాధన పట్ నాయక్ గారు మాటాడుతూ, సాయుధ దళాల లో పని చేసే వారి విషయం లో ప్రత్యేకమైన మానసిక స్వస్థత అవసరాల దృష్టి లో పెట్టుకొని. వారి మానసిక ఆరోగ్య సంబంధి సమస్యల ను తీర్చడం ముఖ్యం అన్నారు.టెలి మానస్ అనేది డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ (డిఎమ్ెహెచ్‌పి) యొక్క డిజిటల్ విస్తృతి అని చెప్పుకోవచ్చును. దీనిలో విస్తృతమైన, ఏకీకృతమైన మరియు అన్ని వర్గాల ను కలుపుకొని పోతూ టెలి మెంటల్ హెల్త్ సేవల ను వారం లో ప్రతి రోజు 24 గంటల పాటూ అందించడ ం జరుగుతుంటుంది. ఈ కార్యక్రమం ప్రతి ఒక్క రాష్ట్రం లో, కేంద్ర పాలిత ప్రాంతం (యుటి) లో మానసిక స్వస్థత పరమైన సహాయత ను సులభం గా పొందడం కోసం 14416 అనే టోల్– ఫ్రీ నంబరు ను అందిస్తున్నది.

ప్రస్తుతం, రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలు కలుపుకొని మొత్తం ముప్ఫై ఆరింటి లోను 51 టెలి మానస్ సెల్స్ విధుల ను నిర్వహిస్తూ ఇరవై వేరు వేరు భాషల లో సేవల ను అందిస్తున్నాయి. 2022 అక్టోబరు లో మొదలుపెట్టినప్పటి నుండి చూస్తే, టెలిమానస్ 10 లక్షల కు పైగా టెలిఫోన్ కాల్స్ ను అందుకొంది. టెలి మానస్ రోజు 3,500 కు పైగా కాల్స్ ను సంబాళిస్తున్నది. ఈ సమాచారాన్ని పట్టి చూస్తే, మానసిక స్వస్థత సంబంధి సేవల కు చెప్పదగిన డిమాండు ఉందని తెలుస్తుంది. అంతేకాకుండా, మానసిక స్వస్థత సంబంధి అంశాల ను సమగ్రం గా, అన్ని వర్గాల ను కలుపుకొని పోయేది గా ఉండాలన్న విషయం – మరీ ముఖ్యంగా సాయుధ బలగాల వంటి ప్రత్యేకమైన సంద ర్భాలలో ముఖ్యం అని సూచిస్తున్నది.

ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారిలో ఆర్థిక సలహాదారు డాక్టర్ శ్రీ కె.కె. త్రిపాఠి; హాస్పిటల్ సర్వీసెస్ (సాయుధ దళాలు) డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్శల్ సాధన సక్సేన నాయర్ గారు, వివిఎస్ఎమ్; ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ (వైద్య పరిశోధన, ఆరోగ్యం మరియు శిక్షణ)ల అడిశనల్ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ శ్రీ ధర్మేశ్; ఆర్మ్ డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ (హెల్త్) డైరెక్టర్ కర్నల్ శ్రీ శుభదీప్ ఘోష్, విఎస్ఎమ్ మరియు రెండు మంత్రిత్వ శాఖల సీనియర్ అధికారులు ఉన్నారు.

# తెలుగుదేశం పార్టీ దాడులతో రాష్ట్ర వ్యాప్తంగా భయానక వాతావరణం

## -మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

అమరావతి జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలుగుదేశం పార్టీ దాడుల తో రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత భయానక వాతావరణం నెలకొందని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకాక ముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.'రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికారపార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. వెరసి ఐదేళ్లుగా పటిష్టంగా ఉన్న శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని పచ్చమూకల అరాచకాలను అడ్డుకోవాలని, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ, సోషల్ మీడియా సైనికులకు తోడుగా ఉంటాం' అని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.కాగా, మంగళవారం వెలువడిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. 175 అసెంబ్లీ స్థానాలకు కేవలం 11 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఇక తెలుగుదేశం పార్టీ 135 స్థానాల్లో అఖండ విజయంతో అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం– జనసేన – బీజేపీ కూటమి ఏకంగా 164 స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో ఓటమిని అంగీకరిస్తూ జగన్ సీఎం పదవికి రాజీనామా చేసేశారు. ఇక ఈనెల 12న రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది.

# జూన్ 12న చంద్ర బాబు ప్రమాణస్వీకారం

అమరావతి జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్ర ప్రదేశ్ లో గెలిచిన నారా చంద్ర బాబు నాయుడు జూన్ 9న ప్రమాణ స్వీకారం చేయకపోవచ్చునని తెలిస్తోంది. బహుశా జూన్ 12 న ప్రమాణస్వీకారం చేయొచ్చు. వాస్తవానికి చంద్రబాబు నాయుడు జూన్ 9న ప్రమాణస్వీకారం చేయనున్నట్లు నిర్ధారణ అయింది. అయితే నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నందున చంద్రబాబు నాయుడు తన ప్రమాణస్వీకారం తేదీని మార్చుకున్నట్లు తెలిసింది. కాగా నారా చంద్రబాబు నాయుడు తన ప్రమాణస్వీకారాన్ని అమరావతిలోనే చేయనున్నట్లు భావిస్తున్నారు. ఈ వివరాలను టిడిపి జాతీయ ప్రతినిధి ప్రేమ్ కుమార్ జైన్ వెల్లడించారు.ప్రధాని నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, ఎల్జెపి(ఆర్) నాయకుడు చిరాగ్ పాశ్వాన్, ఎన్ సిపి నాయకుడు ప్రఫుల్ పటేల్ హాజరు కానున్నారు.

# అక్రమ ల్యాండ్ గ్రాబ్బింగ్ ముఠా గుట్టు రట్టు

## -పోలీసుల అదుపులో 10 మంది నిందితులు

## -వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి, జూన్ 6 :(నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పోలీసులు అక్రమ లాండ్ గ్రాబ్బింగ్ కు పాల్పడుతున్న ముఠా గుట్టును రట్టు




చేశారు. ఆ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ.. మే 26న హైదరాబాద్ చెందిన పెండ్యాల హరినాద్ బాబు సర్వే నెం.198, 251లలో గత భూమిలోకి అక్రమంగా ప్రవేశించారన్నరు.

అత్రియ స్మార్ట్ రియల్ కంపెనీ కార్మికులైన గణపతి రాజు శ్రావణ్ వర్మ అలియాస్ శ్రవణ్, గట్టుముక్కల భరత్ వర్మ, పి.అశోక్ రెడ్డి, పాషా, వారి స్నేహితుడైన అఖిల్, 10మంది కిరాయి మనుషులను తీసుకెళ్లి ఆ భూమిలో తల్వార్ కత్తులు, కట్టెలతో అక్కడున్న వారిని, పనిచేస్తున్న వారిపై దౌర్జన్యం చేస్తూ బూతుమాటలు తిడుతూ దాడి చేయడానికి ప్రయత్నించారన్నారు. చంపుతామని బెదిరించి, అక్కడి నుంచి వెళ్లగొట్టి జేసీబీల సహాయంతో భూమి చుట్టూ వేసిన సుమారు 800 ఫెన్సింగ్ కడ్డీలను విరగ్గొట్టి డ్యామేజ్ చేశారన్నారు.

గాడిపర్తి రవీందర్ బాబు, కూకట్ పల్లి, హైదరాబాద్ మునిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన మునిపల్లి పోలీసులు కేసు పూర్వపరాలను విచారించి ఎస్పీ చెన్నూరి రూపేష్, మునిపల్లి ఎస్ఐ సురేష్, సిబ్బంది అందరూ కలిసి చాకచక్యంగా వ్యవహరించి కిరాయి మనుషులను, యం.ఆర్.యస్ వర్మ దగ్గర పనిచేస్తున్న గణపతి రాజు శ్రావణ్ వర్మ అలియాస్ శ్రవణ్ లు కిరాయి మనుషలను ఏర్పాటు చేసిన ఆనంద రావు ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమంచి ల్యాండ్ గ్రాబింగ్ కు పాల్పడినా, ల్యాండ్ యజమానులకు బెదిరించినా, కిరాయి మనుషలతో లాండ్ లోకి అక్రమంగా ప్రవేశించినా దౌర్జన్యం చేసి ప్రజాశాంతికి భంగం కలిగంచినా చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీ షీట్స్ ఓపెన్ చేసి, పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తరిమి కొట్టేందుకు చేతులు కలుపుదాం

## -ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ పిలుపు

## -ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని "మేము సైతం " పోస్టర్ ఆవిష్కరణ.

హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ పర్యావరణ పరిరక్షణ సంస్థ




అయిన " ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్" బుధవారం సంస్థ కార్యాలయంలో పర్యావరణ హిత ప్రతిజ్ఞ పోస్టర్ మరియు పర్యావరణ పరిరక్షణ కొటేషన్ పోస్టర్ విడుదల చేసింది. ఈ సందర్భంగా కౌన్సిల్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీ హెచ్ రంగయ్య మాట్లాడారు. ఇవాళ సమాజాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసె వస్తువు సింగిల్ యూజ్ బ్యాగులని, వాటిని పూర్తిగా నిషేదించాల్సిన అవసరం ఉందన్నారు. అనేకమంది మిగిలిన ఆహారపదార్దాలను ఈ ప్లాస్టిక్ సంచుల్లో ఉంచి పడవేయడం వల్ల మూగ జీవాలు తిని ప్రాణాలు కోల్పోతున్నాయని అన్నారు.

అంతేగాక ఆయా సంచుల్లో ఉ ండిపోయిన వ్యర్థాల కారణంగా భూ ఉపరితలం దుర్గంధ మయంగా మారుతుందని, నీటి వనరులు మనుగడ కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీనివల్ల ప్రకృతిలో జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. అందుకే ప్లాస్టిక్ ప్రమాదాన్ని వివరించి కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో అక్కడి మానవ సమూహాలతో స్వచ్ఛంద ప్రతిజ్ఞ చేయించి ఈ పోస్టర్ ఆయా సంస్థల ప్రధాన గేటు వద్ద అంటించేలా కార్యక్రమాలు రూపొందించామన్నారు. ప్లాస్టిక్ వాడకం అంటువ్యాధిలా మారిన ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరిలో అవగాహన రావడంతోపాటు వాడకాన్ని కట్టడి చేసేందుకు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. నేడు పర్యావరణాన్ని ఈ ప్లాస్టిక్ తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. అందుకోసం పెద్ద ఎత్తున ఉద్యమానికి కౌన్సిల్ శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం కూడా ఈ ప్లాస్టిక్ నియంత్రణకు చట్టాన్ని పటిష్టం చేయాలన్నారు.

# మెగాస్టార్ ఇంటిలో పవన్ కల్యాణ్ -అంబరాన్ని అంటిన గెలుపు సంబరాలు

## -అన్న ఇంటికి కుటుంబ సమేతంగా వచ్చిన జనసేనాని
## -తల్లికి పాదాబివందనంతో ఆశీస్సులు
## -చిరంజీవికి సాష్టాంగ ప్రణామం
## -వదినతో ఆత్మీయ ఆలింగనం
## -పవన్ కు నిలువెత్తు పూలదండతో మెగాస్టార్ సత్కారం ..
## -మెగా ఫ్యామిలీ సమక్షంలో కేక్ కటింగ్

అమరావతి, జూన్ 6 :ఏపిలో ఎన్నికలల ఘన విజయం సాధించిన పవన్ కల్యాణ్ అన్న చిరంజీవి ఆశీస్సులు తీసుకున్నారు.. నేటి సాయంత్రం భార్య, కుమారుడితో కలిసి మెగాస్టార్ ఇంటికి వచ్చారు.. కారు దిగిన పవన్ కుటుంబాన్ని మెగా ఫ్యామిలీ అప్యాయంగా పలకించింది..



ముందుగా తల్లి పవన్ కు దిష్టి తీసింది.. అనంతరం వదినను అత్మీయ అలింగనం చేసుకుని ఆశీస్సులు తీసుకున్నారు పవర్ స్టార్.. ఆ తర్వాత అన్న చిరంజీవికి సాష్టాంగ ప్రణామం చేశారు .. ఆ సందర్భంగా పవన్ కు నిలువెత్తు పూల దండతో మెగాస్టార్ సత్కరించారు.

మొత్తం మెగా ఫ్యామిలీ సమక్షంలో పవన్ తో కేక్ కట్ చేయించారు చిరంజీవి.. అలాగే పవన్ సోదరిమణులు కూడా తమ ఆశీస్సులను అందించారు.. అనంతరం అందరూ కలిసి గ్రూఫ్ ఫోటోలు దిగారు.

ఈ కార్యక్రమంలో రామ్ చరణ్, వరుణ్ తేజ్, నిహారిక, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు..

# బిఆర్ఎస్ ఓట్లతోనే బీజేపీ ఎంపీ సీట్లు వచ్చాయి..

## - వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కి సర్పంచ్ సీట్ కూడా రాదు

## -టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మొన్న జరిగిన పార్లమెంట్ పలితాల్లో తెలంగాణ లో బిఆర్ఎస్ ఓట్ల తోనే బీజేపీ 8 స్థానాలు వచ్చాయి




అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. గురువారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ బిఆర్ఎస్ వోట్ బ్యాంకు బిజెపి కి బదిలీ చేసింది కేసీఆర్ అన్నారు.బీజేపీ 8 సీట్లు గెలిచినంత మాత్రాన తెలంగాణ కు ఒరిగిందేమీ లేదు అన్నారు.10 ఏండ్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తెలంగాణ కు చేసిందేమీ లేదనీ , 8 మంది ఎంపీ గెలిచి , పార్లమెంట్ లో నిద్ర పోవడానికి తప్ప ఏమిటికి ఉపయోగం లేదని అన్నారు.అసంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ కు 37.35 శాతం వోట్ బ్యాంకు సాధిస్తే, పార్లమెంట్ ఎన్నికల్లో 16.68 కు తగ్గిందని అన్నారు? బలహీనమైన అభ్యర్థులను ఎంపిక చేసుకుని నామమాత్రపు ఎన్నికలకు పోటీచేశారని అన్నారు.. పోలింగ్ చివర లో బీజేపీ, బిఆర్ఎస్ గుర్తులు మార్చుకున్నారని అన్నారు? బిఆర్ఎస్బీజేపీ కి 13.90 శాతం అసాంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ వస్తే పార్లమెంట్ ఎన్నికలకు మాత్రం 35.08 వచ్చిందని అన్నారు? మోడీ గాలి లేదు నూడి గాలి లేదు బిఆర్ఎస్, బీజేపీ రాజకీయ డ్రామా అన్నారు. దేశ వ్యాప్తంగా లేని మోడీ గాలి తెలంగాణ లో ఎలా ఉంటదని ఆయన ప్రశ్నించారు. ఆర్జేడి, చంద్రబాబు, ల మోకాళ్ళ తోనే ఎన్డిఏ కూటమి గద్దె నిక్కిందని అన్నారు.రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ కి సర్పంచ్ సీట్ కూడా రాదని అన్నారు? జెపిటిసి గెలిచే స్థానం లేదని అన్నారు. ప్రజా ప్రాభుత్యానికి ప్రజా పాలనకు బీజేపీ గెలిచిన స్థానాలు లెక్క కూడా కాదని అన్నారు.దేశ వ్యాప్తతంగాకాంగ్రెస్ పార్టీ బలపడిందని అన్నారు.మోడీ కూటమి పై ప్రజలకు సరైన నమ్మకం లేదని అన్నారు.. కూటమి ఎప్పుడు కూలుతుందో ప్రజలు గమనిస్తారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని , మహిళలు , రైతులు, కాంగ్రెస్ తోనే ఉన్నారు అనడానికి ఎన్నికలు సంకేతం అన్నారు.గెలిచిన బీజేపీ సిపాయిలు తెలంగాణ కు ఎన్ని నిధులు కేంద్రం నుండి తీసుకువస్తారో , లేక పోతే ప్రజలు ఉరికాస్తారని , బీజేపీ నేతల పై చనగాని దయాకర్ గాంధీ భవన్ ప్రెస్ మీట్ లో ధ్వజ మెత్తారు.

# కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే లక్ష కోట్లకు పైగా బడ్జెట్ కావాలి

అమరావతి జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీలో ప్రభుత్వ మార్పుపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు టిడీపీ–జనసేన–బీజేపీ కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే లక్ష కోట్లకు పైగా బడ్జెట్ కావాలని తెలిపారు. వాళ్లు ఇచ్చిన అన్ని హామీలు అమలు నెరవేరాలంటే ప్రత్యేక హోదా ఒక్కటే మార్గమని సూచించారు.కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజార్టీ ఉన్నందను ప్రత్యేక హోదా డిమాండ్ చేసే పరిస్థితి లేదని వైఎస్ జగన్ గతంలో చెప్పారని జేడీ లక్ష్మీనారాయణ గుర్తుచేశారు. కానీ ఇప్పుడు కొత్తగా ఏర్పడే ప్రభుత్వానికి డిమాండ్ చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీకి 240 సీట్లు మాత్రమే వచ్చాయని.. ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకుని ఏపీకి ప్రత్యేక హోదా సాధించాలని సూచించారు. విశాఖ రైల్వే జోన్ వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. ఈ ఐదేళ్లు చాలా కీలకమని.. ఇప్పుడు అభివృద్ధి చేయకపోతే రాష్ట్రం బాగుపడదని అభిప్రాయపడ్డారు. ప్రత్యేక హోదా లేకపోతే కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయడానికి.. గత ప్రభుత్వం చేసిన అప్పుల కంటే ఎక్కువగా చేయాల్సి వస్తుందని అన్నారు.

# ఇక బీజేపీ తెలంగాణ గుండె చప్పుడు- కిషన్ రెడ్డి

## -లోక్ సభ ఎన్నికల్లో గెలుపు ఆరంభం మాత్రమే
## -రానున్న రోజుల్లో మాదే ఇక్కడ అధికారం
## -కాంగ్రెస్ తొండి ఆడటంతో మా సీట్లు తగ్గాయి
## -బీఆర్ ఎస్ 13 స్థానాల్లో ఉనికే లేదు
## -కాంగ్రెస్ కు గతం కంటే ఓట్లు తగ్గాయి
## -ఢిల్లీ మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 6 :బీజేపీ తెలంగాణ ప్రజలకు గుండె చప్పుడై ప్రజల కోసం పనిచేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ? ఈ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో బీజేపీ ఎదుగుదలకు ఆరంభం మాత్రమే అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తమ ఉనికిని కోల్పోయిందన్నారు. బీఆర్ఎస్ 14చోట్ల 3వ స్థానానికే పరిమితమైందని తెలిపారు. 8చోట్ల డిపాజిట్లు కోల్పోయిందన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ తప్ప మిగిలిన చోట్ల మూడో, నాలుగో స్థానానికి పడిపోయిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్థానాలు గెలిచిన చోట్ల కూడా ఈసారి ఓట్లు తగ్గాయన్నారు. ఆయా స్థానాల్లో బీజేపీ పుంజుకుందన్నారు. విద్యావంతులు, కవులు, ఉద్యమకారుల ఆకాంక్ష కూడా ఇదే అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మేం 8 చోట్ల గెలిచామన్నారు. మరో 6 చోట్ల రెండో బలమైన ప్రత్యామ్నాంగా నిలిచామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో మా పార్టీ



అభ్యర్థి డీకే అరుణ గెలిచారన్నారు.

సామ, భేద, దాన, దండోపాయాలు రేవంత్ రెడ్డి ప్రయోగించినా.. మా అభ్యర్థిపై అసభ్య పదజాలాలు ప్రయోగించినా.. బీజేపీ కార్యకర్తలను బెదిరించినా.. ప్రజలు బీజేపీకే పట్టం గట్టారని తెలిపారు. గతంలో రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన.. మల్కాజ్‌గిరిలో మా..ఈటెల గారు దాదాపు 3.5 లక్షల మెజారిటీతో గెలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ తొండి అట ఆడిందని, బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేసిందని మండిపడ్డారు.

# అగ్నివీర్ పథకంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేసిన జేడీ(యూ)

న్యూ డిల్లీ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కేంద్రంలో తదుపరి ప్రభుత్వ ఏర్పాటుకు జేడీ(యూ) మద్దతు కీలకమైన నేపథ్యంలో ఆ పార్టీ ప్రతినిధి కేసీ త్యాగి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సైనిక నియామకాల కోసం మోదీ సర్కార్ తీసుకొచ్చిన అగ్నివీర్ పథకంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అగ్నివీర్ స్కీమ్ పట్ల ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారని చెప్పుకొచ్చారు. ఈ పథకంపై ప్రజలు లేవనెత్తిన లోటుపాట్లను వివరంగా చర్చించి వాటిని చక్కదిద్దాలని తమ పార్టీ కోరుకుంటోందని చెప్పారు.ఉమ్మడి పౌరస్మృతిపై పార్టీ అధ్యక్షుడి హోదాలో బిహార్ సీఎం నితీష్ కుమార్ లా కమిషన్ చీఫ్‌కు లేఖ రాశారని గుర్తుచేశారు. తాము ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకం కాదని, కానీ యూసీసీపై ప్రభావితమయ్యే అన్ని వర్గాల ప్రజలతో చర్చించి ఓ పరిష్కారం అన్వేషించాలని త్యాగి పేర్కొన్నారు.

# విప్లవ పార్టీలకు ఎవరూ సహకరించవద్దు..

## -అపరిచిత వ్యక్తులు కనబడితే వెంటనే సమాచారం ఇవ్వండి



వరంగల్, జూన్ 6 : కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్న విప్లవ పార్టీలకు ఎవరూ సహకరించవద్దని వాజేడు ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు.

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పొంగాల గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రజలతో మాట్లాడుతూ మావోయిస్టుల వల్ల ప్రజలకు నష్టం తప్ప లాభం లేదని, అందువల్లనే ఎవరైనా అనుమానితులు, కొత్త వ్యక్తులు గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరించినట్లైతే వెంటనే పోలీస్ లకు సమాచారం అందించాల్సిందిగా ఆయన కోరారు.

అదేవిధంగా మావోయిస్టు పోస్టర్స్ చూపించి ఆ పోస్టర్స్ ను ఊర్లో అంటించి అందులోని వారెవరైనా కనిపించినట్లైతే వెంటనే సమాచారం అందించాలని చెప్పారు.

ఆ వ్యక్తుల వివరములు గోప్యంగా ఉంచి, వారికి తగిన బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్లిష్టమైనటువంటిబ్రెయిన్ ట్యూమర్ సర్జరీకై అత్యాధునిక ఇంట్రాఆపరేటివ్ ఇమేజింగ్ ఉపకరణాన్ని సమకూర్చుకొన్నటాటా మెమోరియల్ సెంటర్

న్యూఢిల్లీ, జూన్ 6 :సంక్లిష్టమైనటువంటి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ ల నిర్వహణ కు గాను ముంబయి లోని టాటా మెమోరియల్ సెంటర్ (టిఎమ్‌సి) యొక్క నాడీ శస్త్రచికిత్స ల విభాగం ఇటీవలె ఒక అత్యాధునిక ఇంట్రాఆపరేటివ్ అల్ట్రాసౌండ్ (ఐయుఎస్) యంత్రాన్ని కొనుగోలు చేసింది. డాక్టర్ శ్రీ అలీ అస్‌గర్ మొయియాదీ నాయకత్వం లో టాటా మెమోరియల్ సెంటర్ లోని న్యూరో సర్జరీ బృందం భారతదేశం లో ఐయుఎస్ ను ఉపయోగించడాన్ని మొదలుపెట్టింది. ఈ బృందం ప్రపంచ వ్యాప్తం గా అగ్రగామి బృందాల లో ఒకటి గా ఉంది. ఐయుఎస్ అనేది తక్కువ ఖర్చు లో లభించేదే కాక తగిన శిక్షణ యొక్క అండ తో, న్యూరో సర్జన్ యొక్క చికిత్స ఉపకరణాల లో ఒక ముఖ్యమైన సహాయక పరికరం గా నిలువ గలదు. ఈ విభాగం ఇటీవలే సమకూర్చుకొన్నటువంటి బికెయాక్టివ్ (ఎబిఇజా-బీతిల) యంత్రం దేశం లో ఈ తరహా అత్యాధునిక ఐయుఎస్ వ్యవస్థ లో ఒకటో యంత్రం అని చెప్పాలి.

ఇంట్రాఆపరేటివ్ ఇమేజింగ్ ద్వారా మెదడు లో గడ్డ/కణితి/వాపు ను సురక్షితం గాను మరియు కచ్చితత్వం తోను తొలగించడం సాధ్యపడుతుంది. అపసవ్యత చెంతకు సరి అయినటువంటి మార్గం లో చేరుకోవడం లో సాయపడే సాధనాల (ఇవి ఒక విధం గా శస్త్ర చికిత్స ల విషయం లో జిపిఎస్ వ్యవస్థ ను పోలి ఉంటాయి) తో కూడిన ఐయుఎస్ యంత్రం న్యూరో సర్జన్ లు ట్యూమర్ యొక్క అవశేషాల ను నిశితం గా పరిశీలించేందుకు వీలు ను కల్పిస్తుంది. అంతకు మించి, దీనిని జాగృతావస్థ లో శస్త్ర చికిత్స వంటి బ్రెయిన్ మేపింగ్ టెక్ నిక్ లను జతపరచడం జరిగిందా అంటే, అప్పుడు అది మెదడు లోని అత్యంత కీలకమైన క్షేత్రాల దగ్గర కూడాను, ట్యూమర్ ను మౌలికంగా తొలగించేందుకు సహకరించగలుగుతాయి.

ఈ వ్యవస్థ ను ముంబయి లోని పరేల్ లో గల టాటా మెమోరియల్ హాస్పిటల్ లో ఆ ఆసుపత్రి యొక్క డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీ శైలేశ్ శ్రీఖండే, టాటా మెమోరియల్ సెంటర్ యొక్క న్యూరో సర్జరీ ప్రధానాధికారి డాక్టర్ శ్రీ అలీ అస్‌గర్ మొయియాదీ, విప్రో జిఇ హెల్త్ కేయర్ సౌథ్ ఏశియా యొక్క మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చైతన్య సారావటె ల సమక్షం లో 2024 జూన్ 1 వ తేదీ శనివారం నాడు ఆవిష్కరించడమైంది. ఈ సందర్భం లో సదరు విభాగం ఉద్యోగుల తో పాటు ఆపరేశన్ థియేటర్ సిబ్బంది కూడా పాలుపంచుకొన్నారు.

ఈ ఆధునిక సాధనం తో తన బృందం లోని వైద్యుల కు ఉపయోగకరం గా ఉండడం తో పాటుగా దీనివల్ల ఈ కేంద్రాని కి పెద్ద సంఖ్య లో వచ్చే బ్రెయిన్ ట్యూమర్ రోగుల కు కూడాను ఉపయుక్తం గా ఉంటుంది అని డాక్టర్ శ్రీ మొయియాదీ భావిసిస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్ రోగ్రస్తుల లో చాలా మంది వేరే చోటుల లో సబ్సిడీ రేటుల కు అత్యంత అధునాతనమైన సంరక్షణ ను పొందడం లో విఫలం అవుతున్నారు. ఇంట్రాఆపరేటివ్ ఎమ్ఆర్ఐ మాదిగానే ఇతర ఇంట్రాఆపరేటివ్ ఇమేజింగ్ సిస్టమ్స్ తో పోల్చితే ఐయుఎస్ కు తక్కువ ఖర్చు అవుతుంది. టాటా మెమోరియల్ సెంటర్ వంటి పరిమిత నిధుల సమస్య తో సతమతం అవుతున్న ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల కు ఇతోధిక లాభకరం గా ఐయుఎస్ ఉంది. ఐయుఎస్ మార్గదర్శకత్వం లో శస్త్ర చికిత్స ను కోరుకొన్న స్థాయి లో నిర్వహించడానికి అవసరపడే నైపుణ్యాల ను అలవరచేందుకు న్యూరో సర్జన్ లకు శిక్షణ ఇచ్చే ప్రయాసల కు కూడా ఈ విభాగం చొరవ తీసుకొంటున్నది. భారతదేశం లో పెద్ద సంఖ్య లో రోగుల కు ప్రయోజనాల ను అందించడం కోసం ఈ సాంకేతికత ను మరింత మంది న్యూరో సర్జన్ లు అవలంబించేటందుకు భారతదేశం లో మరియు ప్రపంచ దేశాల లో శిక్షణ కోర్సుల ను నిర్వహించే ఏర్పాటు చేయడమైంది. యుబిఎస్ యొక్క ఉదారమైన గ్రాంటు సాయం తో ఈ ఉపకరణాన్ని కొనుగోలు చేయడమైంది అని డాక్టర్ శ్రీ ఎ. మొయియాదీ తెలియజేశారు. యుబిఎస్ అందించిన సహాయానికి గాను టిఎమ్ సి ధన్యవాదాల ను తెలియజేస్తోంది అని ఆయన అన్నారు. భారతీయులు అందరికీ ఆధునిక కేన్సర్ సంరక్షణ ను అందించే దిశ లో టిఎమ్ సి చేస్తున్న కృషి కి ఈ విధమైన తోడ్పాటు వెన్నుదన్ను గా నిలుస్తుంది అని ఆయన అన్నారు.

ప్రారంభ కార్యక్రమం లో పాల్గొన్న శ్రీ సారావటె మాట్లాడుతూ, “మేం శరీర నిర్మాణ విజ్ఞానాన్ని మరియు గాయాల ను తేరిపార చూడగలగడం లో తోడ్పాటు ను అందించేటటువంటి, జ్ఞానానికి మార్గదర్శనం చేసేటటువంటి మరియు మానవ శరీరం లోపల నేవిగేట్ చేయడం లో తోడ్పడే క్రియాశీల ఇమేజింగ్ వ్యవస్థల ను రూపొందించడానికి కంకణం కట్టుకొన్నాం. మరి ఈ బికెయాక్టివ్ సిస్టమ్ సహకారం భారతదేశం లో ఆరోగ్య సంరక్షణ సంబంధి సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందుకు తీసుకు పోవడం లో ఒక ప్రముఖమైన కార్యసాధన గా మిగలడం ఒక్కటే కాకుండా న్యూరోసర్జరీ లో విప్లవాత్మకమైన మార్పు ను తీసుకు రావడం కోసం సిద్ధంగా ఉంది” అన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగంపెంచి త్వరగా పూర్తిచేయాలి:జిల్లాకలెక్టర్



ఖమ్మం, జూన్ 6 :(నేటినిజం ప్రతినిధి): అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్, కొనిజర్ల మండలం అమ్మపాలెం, బస్వాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేశారు.

పాఠశాలకు మంజూరు నిధులు, చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, ఇంకనూ పూర్తి కావాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అడ్వాన్స్ ఎంత అందినది, పనులు పూర్తయిన వాటి విలువ వివరాలు అడిగారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుద్దీకరణ, టాయిలెట్ బ్లాకులు, త్రాగునీటి సరఫరా పనులు పరిశీలించారు. టాయిలెట్లలో రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. పాఠశాల ప్రవేశ ద్వారం, పాఠశాల లోపల వీధి దీపాలు అమర్చాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభంలో వచ్చే పిల్లలకు తమ పాఠశాలలో స్పష్టమైన మార్పు రావాలన్నారు. పాఠశాలల్లో నమోదులు పెరిగేలా బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధన జరుగుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రుల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కలెక్టర్ తనిఖీల సందర్భంగా డిఇఓ సోమశేఖరశర్మ, ఎంపిడివో రోజారాణి, ఎంఇఓ శ్యామ్సన్, పాఠశాల హెచ్‌ఎంలు వై.కోటేశ్వరరావు, సిహెచ్.వెంకటేశ్వర్లు, అధికారులు, తదితరులున్నారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



మహబూబ్‌నగర్, జూన్ 6 : గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణ పనులను ఇవాళ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడం జరిగిందన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో గద్వాల జిల్లాలో మెడికల్ కాలేజీ మంజూరు చేసుకోవడం జరిగిందని, దాదాపుగా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తి కావడం జరిగిందన్నారు.

త్వరలోనే అన్ని రంగులతో అన్ని పరికరాలతో ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చి త్వరలో మెడికల్ కాలేజీ ఆసుపత్రిని ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ సంవత్సరం మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు త్వరలోనే ప్రారంభం రావడం జరుగు తుందని, అదేవిధంగా తరగతులు కూడా ప్రారంభించి మెడికల్ విద్యార్థులకు అన్ని విధాలా సౌకర్యాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మెడికల్ కాలేజీలో సౌకర్యాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యం అందించే విధంగా తమ వంతు కృషిచేసి ప్రభుత్వ సహకారంతో కూడా అన్ని విధాలుగా మెడికల్ కాలేజ్ కి తన వంతు కృషి చేయడం జరుగుతు ందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు గడ్డం కృష్ణారెడ్డి, జి.వేణుగోపాల్, ఎంపీపీ విజయ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్స్ మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, దౌలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంగడి బసవరాజ్, మహబూబ్, నవీన్ రెడ్డి, భగీరథ వంశీ, కురు మన్న, మధు, నాయకులు, కార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డలో కొనసాగుతున్న గ్రౌటింగ్ పనులు



హైదరాబాద్, జూన్ 6 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ (లక్ష్మి )బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో 18, 19 పియర్ల వద్ద ఇటీవల చేపట్టిన గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయి. గ్రౌటింగ్ యంత్రాల సాయంతో బరాజ్‌లో మొత్తం 85 గేట్లకు గాను గతంలో 78 గేట్లు ఎత్తివేయగా, దెబ్బతిన్న పియర్ల వద్ద ఉన్న 20, 21 గేట్లు ఎత్తేందుకు వీలుకాకపోవడంతో ఆర్క్ గ్రౌగింగ్ పరికరంతో కట్ చేసే పనులు జరుగుతున్నాయి. ఏడో బ్లాక్‌లో 16వ గేట్ ఎత్తగా, 17 గేటు ఎత్తేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్‌డీఏఎస్ సూచన మేరకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. బరాజ్‌లో లోపాలపై అధ్యయనం చేయడానికి బుధవారం వచ్చిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం సభ్యుల పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ బృందం మరోవారం రోజులపాటు బరాజ్‌లో లోపాలపై పలు రకాల శాంపిల్స్‌ను సేకరించి క్షేత్ర స్థాయిలో పరిశీలన, పరీక్షలు చేయనున్నట్లు తెలిసింది. బరాజ్ దిగువన నీటి ప్రవాహానికి పియర్ల చుట్టూ ఉన్న ఇసుక కొట్టుకుపోకుండా యంత్రాల సాయంతో షీట్‌ఫైల్స్ అమర్చుతున్నారు. డౌన్, అప్ స్ట్రీమ్‌లో సీసీ బ్లాక్‌లను తీసి అమర్చుతున్నారు.

# ఈనెల 11న టీడీపీఎల్పీ సమావేశం

## -12న చంద్రబాబు ముఖ్యమంత్రి గా ప్రమాణం : గోరంట్ల

అమరావతి జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఈనెల 11న టీడీపీఎల్పీ సమావేశం జరుగుతుందని టీడీపీ నాయకుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి వెల్లడించారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశం అనంతరం పార్టీ ఎమ్మెల్యేలతో కూడిన నివేదికను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేసామని తెలిపారు. ఈనెల 12న చంద్రబాబు ముఖ్యమంత్రి గా ప్రమాణం చేస్తారని వెల్లడించారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతో సహా పలు పార్టీల నేతలు హాజరుకానున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రధాని ప్రమాణస్వీకారంతో పాటు ఒడిశాలో జరిగే బీజేపీ సీఎం ప్రమాణస్వీకారంలో పాల్గొంటారని వివరించారు.

**జగన్ ఇంకా మారలేదు..**

ఏపీ ఎన్నికల్లో ఘోరాపరాభవం పాలైన వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇంకా మారడం లేదని బుచ్చయ్య చౌదరి విమర్శించారు. అసహనంతో టీడీపీ శ్రేణులపై దాడులకు ప్రేరేపిస్తున్నారని, టీడీపీ శ్రేణులు దాడులు చేస్తున్నట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

# జూన్ 26లోగా సెంట్రల్ ఎక్సైజ్ బిల్లు 2024 ముసాయిదాపై ముందుగా నిర్ణయించిన పద్ధతిలో సూచనలివ్వాలి

న్యూఢిల్లీ, జూన్ 6 :సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ), రెవెన్యూ విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, జూన్ 26, 2024 నాటికి సెంట్రల్ ఎక్సైజ్ బిల్లు 2024 ముసాయిదాపై స్టేక్ హోల్డర్ల నుంచి సూచనలను ఆహ్వానిస్తున్నాయి.

సీబీఐసీ సెంట్రల్ ఎక్సైజ్ బిల్లు 2024 ముసాయిదాను సిద్ధం చేసింది. ఈ బిల్లు అమల్లోకి వస్తే ప్రస్తుతమున్న సెంట్రల్ ఎక్సైజ్ యాక్ట్ 1944 రద్దవుతుంది. సులభతర వ్యాపార విధానాలను ప్రోత్సహించడంతో పాటు పాత, వ్యర్థ చట్టాలను రద్దు చేసి సమగ్రమైన ఆధునికమైన కేంద్ర ఎక్సైజ్ చట్టాన్ని తీసుకురావడమే ఈ ముసాయిదా ప్రధాన ధ్యేయం. ఈ బిల్లులో 12 చాప్టర్లు, 114 సెక్షన్లు, రెండు షెడ్యూల్లు ఉన్నాయి.

చట్ట రూపకల్పన ప్రక్రియలో భాగంగా కేంద్ర ఎక్సైజ్ బిల్లు 2024 ముసాయిదాను సీబీఐసీ వెబ్సైటో (https://www.cbic.gov.in) అప్లోడ్ చేయడంతో పాటు స్టేక్ హోల్డర్స్ నుంచి 21 రోజుల్లోగా సూచనలు కింది ఫార్మాట్లో అందజేయాల్సిందిగా ఆహ్వానించింది.క్రమసంఖ్య ముసాయిదా బిల్లులోని క్లాజ్ నెంబర్ క్లాజ్ టైటిల్ సూచించిన మార్పులు ఏమైనా ఉంటే కారణాలు/వ్యాఖ్యలు/రిమార్కులుముసాయిదా బిల్లుపై సూచనలు/వ్యాఖ్యలు పైన తెలిపిన పద్ధతిలో ఎంఎస్ వర్డ్ (లేదా కంపాటబుల్ ఫార్మాట్) లేదా మెషీన్ రీడబల్ పీడీఎఫ్ ఫార్మాట్లో పంపించాలి.

# ప్రధాన మంత్రి కి టెలిఫోన్ లో అభినందనల ను తెలిపిన ఆస్ట్రేలియా ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 6 :ఆస్ట్రేలియా ప్రధాని శ్రీ ఎంథని అల్బనీజ్ ఈ రోజు న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో టెలిఫోన్ లో మాట్లాడి అభినందనల ను తెలియజేశారు. ఆస్ట్రేలియా ప్రధాని తనకు శుభాకాంక్షల ను తెలిపినందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయన కు ధన్యవాదాలను పలికారు.

ఆస్ట్రేలియా ను 2023 వ సంవత్సరం లో సందర్శించిన తాను సంగతి ని మరియు దిల్లీ లో గడచిన సెప్టెంబర్ లో జి20 శిఖర సమ్మేళనం జరిగిన సందర్భం లో ప్రధాని శ్రీ అల్బనీజ్ తో తాను సమావేశం కావడాన్ని ప్రధాన మంత్రి ఆప్యాయం గా గుర్తుకు తెచ్చుకొన్నారు.

ఆస్ట్రేలియా ప్రధాని తో కలసి సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత దృఢతరమైంది గా మలచడం మరియు ఇండో-పసిఫిక్ రీజియన్ లో ఉమ్మడి ప్రాథమ్యాల విషయం లో కలిసికట్టు గా పని చేయాలన్నదే తన దృఢ నిబద్ధత అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు.

# దారుణ హత్యకు గురైన ఇద్దరు యువకులు..

హైదరాబాద్, జూన్ 6 :రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని బటర్ ఫ్లై సిటీలో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురైన ఘటన ఇవాళ ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం? హైదరాబాద్ లో ఉంటున్న కడ్తాల్ మండలంలోని గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన గుండమోని శివ(24), శేషగారి శివ (29) అను ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం రాత్రి ఘటన చోటు చేసుకున్నట్టు తెలుస్తుంది.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గుండమోని శివ హైదరాబాద్ హైటెక్ సిటీలో చికెన్ షాప్ లో పనిచేస్తుండగా, శేషగారి శివ హైదరాబాద్ లో డ్రైవర్ గా పనిచేస్తున్నట్టు సమాచారం.

# ఇప్పటికైనా ప్రేలాపనలు మానుకోవాలి

## -ఇప్పటికైనా పాలనపై, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆయన హితవు



హైదరాబాద్ జూన్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గణనీయంగా పడిపోయిన, ఓడిపోయిన, పారిపోయిన వ్యక్తి ఎవరంటే.. అది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డియేనని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి ఓడిపోయారు.. ఆ తర్వాత ముఖ్యమంత్రి అయ్యారు. తాను ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టారు. తన సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఓడించారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 8 స్థానాలు గెలిస్తే.. ఆ విజయంలో రేవంత్ రెడ్డి పాత్ర నామమాత్రమేనని ఎద్దేవా చేశారు. ఖమ్మంలో కాంగ్రెస్ గెలిచిందంటే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖాతానే.. నల్గొండలో విజయానికి కారణం జానారెడ్డి బలమే కారణమని.. భువనగిరిలో కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రభావం వల్ల కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు. వరంగల్ లో కొంతకాలం క్రితం కాంగ్రెస్ లో చేరిన కడియం శ్రీహరికున్న రాజకీయ బలంతోనే కాంగ్రెస్ గట్టెక్కింది. పెద్దపల్లిలో వెంకటస్వామి గారి కుటుంబానికి చెందిన వ్యక్తి పోటీలో ఉండటమే కారణమని విశ్లేషించారు. అంతేకాని... ఏ పార్లమెంటు నియోజకవర్గంలోనూ రేవంత్ రెడ్డి పాత్ర లేదంటూ, అసలు ఆయన ప్రభావమే లేదంటూ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి, దుస్థితి ఇలా ఉందంటూ సెటైర్లు విసిరారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కామారెడ్డిలో ఓడిపోయినా.. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చి ముఖ్యమంత్రిని చేసింది. రాష్ట్రంలో కల్తీ విత్తనాలతో, విద్యుత్ కొరతతో రైతులు తమతమవుతున్నారని.. విత్తనాల కోసం బారులు తీరి లైన్లు కడుతున్న దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తూనే... సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా పాలనపై, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ పుణ్యం వల్లనే బీఆర్ఎస్ తో కాంగ్రెస్ కు ఉన్న సంబంధాలు, అనుబంధం వల్లే కాంగ్రెస్ 8 సీట్లలో గెలుపొందిందంటూ ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికలు తన పాలనకు రెఫరండం అంటూ రేవంత్ ప్రకటించారు.. అసలు తన వల్ల కాంగ్రెస్ పార్టీకి గెలుపే సాధ్యం కాలేదు. అటువంటి వ్యక్తులు నరేంద్ర మోదీ గారిని విమర్శించడం సిగ్గుచేటంటూ నిప్పులు చెరిగారు. కనీసం డిసెంబర్ 9 వరకైనా తన ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవాలనే ఆరాటంతో రేవంత్ రెడ్డి కొత్త ఆలోచన చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సోనియా గాంధీని ఆహ్వానిస్తామంటూ ప్రకటించి, సోనియా మెప్పుకోసం ప్రయత్నాలు మొదలుపెట్టారని డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు. డిసెంబరు 9 తెలంగాణ ప్రజలు ఆవేదనకు గురయ్యే రోజని.. ఆనాడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించి, వెనక్కి తీసుకున్న రోజంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తన బలాన్ని గణనీయంగా పెంచుకుని 8 సీట్లను కైవసం చేసుకుంది. ప్రజలు బిజెపి ని ఒక బలీయమైన శక్తిగా గుర్తించి గెలిపించారని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తెలిపారు. నరేంద్ర మోదీ గారు మూడోసారి ప్రధానమంత్రి కాబోతున్నారని కొనియాడారు. ఎన్డీయే ప్రభుత్వం అందరినీ కలుపుకుని ముందుకెళ్తూ, ప్రజల ఆలోచలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తుందని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ వెల్లడించారు.

# ఫోన్ ఇన్ విత్ యువర్ ఎమ్మెల్యే కు.. బొజ్జు పటేల్ శ్రీకారం..



ఆదిలాబాద్, జూన్ 6 :ఎమ్మెల్యేలు గ్రామాలకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడం, ఆ సమస్యలను ఎమ్మెల్యేల పీఏలు రాసుకోవడం జరుగుతుంది. కానీ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గ్రామాల్లో తిరిగి సమస్యలు తెలుసుకుని, వాటితో పాటు వినూత్న రీతిలో ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజల నుండే తెలుసుకొని, ఆ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వినూత్న రీతిలో “ఫోన్ ఇన్ విత్ యువర్ ఎమ్మెల్యే” అనే కార్యక్రమానికి ఉట్నూర్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఇవాళ ఉదయం శ్రీకారం చుట్టారు.

ఈ కార్యక్రమంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఖానాపూర్, కడం, జన్నారం, పెంబి, దస్తురాబాద్, సిరికొండ మండలాల వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు, ఉద్యోగులు ఫోన్ ద్వారా ఎమ్మెల్యేతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న నీటి, రోడ్లు, డ్రైనేజీ, కరెంటు, మిషన్ భగీరథ, జీవో నంబర్ 3, ఫారెస్ట్, జీవో నంబర్ 317, భూమికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సిఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదింటి బిడ్డయిన తనను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు, నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని ఆయన తెలిపారు.






భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో
అమరవాది ఫౌండేషన్
సాహిత్య, సాంస్కృతిక సంస్థ నిర్వహణలో
శ్రీమతి అమరవాది హైమవతీ-డా.ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్ సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : ఆచార్య సి. మృణాళిని
డా.ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్-శ్రీమతి హైమవతి బాల సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : శ్రీ గరిపెల్లి అశోక్
డా. అమరవాది నీరజ
బాలల కథలు ‘ఏడు రంగుల జండా’ పుస్తకావిష్కరణ
13 జూన్, 2024 గురువారం, సాయంత్రం 6 గంటలకు,
సమావేశ మందిరం, మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్
ముఖ్య అతిథి
శ్రీ మణికొండ వేదకుమార్
సంపాదకులు, బాలచెలిమి బాల వికాస పత్రిక & దక్కన్ లాండ్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి
అధ్యక్షులు
డా. పత్తిపాక మోహన్
దక్షిణ ప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం
విశిష్ట అతిథులు
డా. జుర్రు చెన్నయ్య
కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు
శ్రీ చొక్కాపు వెంకటరమణ
సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత
అమరవాది ఫౌండేషన్ పక్షాన
డా. అమరవాది నీరజ (అధ్యక్షులు) • ఎ. సీతారాం (ఉపాధ్యక్షులు) • చింతకింది మాల్య్వ (ప్రధాన కార్యదర్శి) • డా. హారిక చెరుకుపల్లి (నిర్వాహక కార్యదర్శి)

# ఇస్లాం.. క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన జీవితం నేర్పుతుంది

## -సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్



కరీంనగర్, జూన్ 6 : (నేటినిజం ప్రతినిధి) ఇస్లాం క్రమశిక్షణతో కూడిన నైతిక విలువలతో కూడిన జీవన విధానాలను నేర్పుతుందని మానవుని లో దైవ భీతి, ఆధ్యాత్మిక చింతనతో మనిషిలోని సకల సమానతలు దూరమైపోయి మానసిక రుగ్మతలకు స్వస్తి పలికి ప్రశాంతమైనటువంటి జీవితం కొనసాగించవచ్చని మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్, ఇస్లాహిల్ బనాథ్ ప్రిన్సిపాల్ ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ అన్నారు. నగరంలోని హుస్సేనీపురాలో నీ మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ , ఇస్లాహిల్ బనాథ్ మదరసా భవనంలో నిర్వహించిన ఇస్లామిక్ అరబ్బీ ఎడ్యుకేషన్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ముఫ్తి ఘియాస్ మోహియోద్దీన్ విద్యార్థులకు బహుమతులను ప్రధాన ఉత్సవం చేశారు. ఈసందర్భంగా ముఫ్తి ఘియాస్ మాట్లాడుతూ.. చిన్నారులకు ఇస్లామిక్ విద్యపై ఖురాన్ పఠనంపై సమ్మర్ క్యాంప్ లో నిష్ణాతులైన ఇస్లామిక్ పండితులచే నేర్పించావన్నారు. వేసవి సెలవుల్లో ఇంగ్లీష్ మీడియం చదివే విద్యార్థులు చిన్నారులు సమయం వృధా చేయకుండా ఇస్లామిక్ విద్యను ఖురాన్ చదువును నేర్చుకోవడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణ దైవ భీతి తోపాటు మనిషి జీవితంలో పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు జీవన విధానం ఏ విధంగా గడపాలో అలాంటి అవగాహన పెంపొందించడానికి సమ్మర్ క్యాంప్ చిన్నారులకు దోహదపడిందన్నారు. ప్రస్తుత తరుణంలో మనిషి స్వార్థ పూరితమైన, నా, నేను, నాకు అనేటువంటి జీవితం కొనసాగిస్తున్నాడని, భూలోకం మనిషికి శాశ్వతం కాదని పరలోకం శాశ్వతమన్నారు. భూలోకంలో చేసిన ప్రతి పనికి పరలోకంలో అల్లాహ్ కు జవాబు చెప్పాల్సి ఉంటుందని గ్రహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ అహ్మద్ హిఫ్జి, హాఫిజ్ హమీద్, ముఫ్తి ముసెబ్, యూసుఫ్ అలీ, కబీరోద్దీన్, మహమ్మద్ రఫీ, చిన్నారుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ గారూ -జోక్యం చేసుకోండి.. జగన్

అమరావతి, జూన్ 6 :టీడీపీ దాడులు చేస్తోందని, గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొందని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు ."సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైసీపీ కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికార పార్టీ ఒత్తిళ్లకు పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారింది. ఐదేళ్లుగా పటిష్ఠంగా ఉన్న శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని వచ్చుమూకల అరాచకాలను అడ్డుకోవాలి. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తిచేస్తున్నాం. టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ, సోషల్ మీడియా సైనికులకు తోడుగా ఉంటాం" అని జగన్ ట్వీట్ చేశారు.

# గ్రామీణ ప్రాంత ఇమాంలు సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి

## -మజ్లీస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ పిలుపు



కరీంనగర్, జూన్ 6 : (నేటినిజం ప్రతినిధి) మానవత్వమే పునాదిగా సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మజ్లీస్ తహఫుజ్ ఖత్మె నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని హుస్సేనీ పుర మదర్సా ఇస్లాహిల్ బనాత్ లో గ్రామీణ ప్రాంత ఇమా ంలతో నెలవారీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ అల్లాహ్ తన విశ్వాసులకు కరుణ, ప్రేమతో మెలగాలని ఆదేశం చారని, సోదరభావంతో ఒకరికొకరు సహకరించుకుంటూ ఎల్లప్పుడూ మానవాళికి సేవ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మస్జిద్ లలో సేవ చేస్తున్న ఇమామ్లు ముస్లిం సమాజానికి దిశా నిర్దేశం చేయాలని అన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న మసీదుల ఇమామ్లయిన మత గురువులకు జీతాలు సకాలంలో అందించాలని కోరారు. ఎల్లప్పుడూ వారి బాగోగులు చూసుకునే బాధ్యత మసీదు కమిటీలపై ఆయా గ్రామాల్లో ఉంటుందని చెప్పారు. పట్టుదలతో సమాజ సేవలో నిమగ్నమైన మత గురువులకు మసీదు కమిటి పాలకవర్గం సకాలంలో జీతం ఇచ్చేలా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాఫిజ్ అహ్మద్ హిఫ్జి, మౌల్వి మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ జన్మదిన వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జూన్ 6 :(నేటినిజం ప్రతినిధి): : టీయుడబ్ల్యూహెచ్ 143 వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్ జన్మదిన వేడుకలను గురువారం జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రఫిక్ ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి కోరుకున్నారు. తన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన జర్నలిస్టులందరికీ రఫిక్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

తమ సంస్థ బలోపేతానికి కృషి చేస్తానే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, సీనియర్ జర్నలిస్ట్ మొకాళ్ళ ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి జితేందర్ రావు, ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, డిప్యూటీ జనరల్ సెక్రెటరి,శ్రీహరి, మాజీ అధ్యక్షుడు ఎంరెడ్డి కనక రెడ్డి,ప్రచార కార్యదర్శి షేక్ రియాజ్, బండి శ్రీకాంత్,రజనీకాంత్, రాజేందర్, వెంకటేష్, శ్రీకాంత్, నుగురి ప్రశాంత్, గంగాధర్, బండి హరీష్, జగన్, దీపక్, కోడం గంగాధర్,పోగుల వేణు , ప్రశాంత్పాల్గొన్నారు.

# మహారాష్ట్ర కాంగ్రెస్‌లో విజయోత్సవం..

## 96 కేజీల లడ్డూలతో నానా పటోలేకు తులాభారం

ముంబై, జూన్ 6 : లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో అధిక సీట్లు సాధించడంపై మహారాష్ట్ర కాంగ్రెస్‌లో సంబరాలు మిన్నంటాయి. పార్టీ కార్యాలయంలో గురువారం విజయోత్స వాన్ని జరుపుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలేకు 96 కేజీల లడ్డూలతో తులాభారం నిర్వహించారు. 'విజయీభవా' అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.కాగా, మహారాష్ట్రలోని 48 సీట్లకుగాను ప్రతిపక్షాల మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కూటమి లోక్‌సభ ఎన్నికల్లో 30 స్థానాలు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 13 సీట్లు, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 9 సీట్లు, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) ఎనిమిది సీట్లు గెలుచుకుంది.మరోవైపు 2019లో 23 సీట్లు గెలిచిన బీజేపీ ఈసారి కేవలం 9 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 7 సీట్లు, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ ఒక్క సీటు గెలుచుకున్నాయి.

కాగా, ఈ ఏడాది చివర్లో జరుగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 150 సీట్లలో పోటీ చేసి గెలుస్తామని నానా పటోలే తెలిపారు. లోక్‌సభ ఎన్నికల పనితీరును మళ్లీ ప్రదర్శిస్తామని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో అవకతవకలు..

## ఏకపక్షంగా ఫలితాల ప్రకటన : రాకేశ్ రెడ్డి

నల్లగొండ, జూన్ 6 : నల్లగొండ – ఖమ్మం – వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరుగుతున్నాయని, ఏకపక్షంగా ఫలితాలు ప్రకటిస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ కౌంటింగ్ కేంద్రంలో ఆర్వో తీరును నిరసిస్తూ రాకేశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన గెలుపును అడ్డుకునేందుకు ఓట్ల లెక్కింపులో అనేక అవకతవకలకు పాల్పడుతున్నారు. కౌంటింగ్ కేంద్రాల నుంచి తమ ఏజెంట్స్‌ను బయటకు పంపించేస్తున్నారు. ఏకపక్షంగా ఫలితాలు ప్రకటిస్తున్నారు. రౌండ్లు పూర్తయిన తర్వాత కనీసం తమ ఏజెంట్స్ వద్ద సంతకాలు కూడా తీసుకోవడం లేదు. ఆర్వోను కలిసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకుంటున్నారు. 3 గంటల పాటు ఆర్వో ఆఫీస్ వద్ద పడిగాపులు పడాల్సి వస్తుంది. 17 వేల పైచిలుకు మెజార్టీని 18 వేల పైచిలుకుగా ఏకపక్షంగా ప్రకటించారు. మూడో రౌండ్‌లో తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజల తీర్పును శిరసావహిస్తాం. కానీ పారదర్శంగా కౌంటింగ్ జరపాలన్నది తమ డిమాండ్. ఒకే హాల్‌లో వెయ్యి ఓట్ల తేడా వచ్చింది.

# విద్యార్థికి బీఆరెస్ నేత మనోహర్ రెడ్డి అభినందన



రాజన్న సిరిసిల్ల, జూన్ 6 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన ప్రభుత్వ న్యాయవాది గుడిసె సదానందం కుమారుడు గుడిసె జేమ్స్ నీట్ ఫలితాలలో ఎంబీబీఎస్ లో ప్రభుత్వ సీటు సాధించగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి గురువారం విద్యార్థి జేమ్స్ ను సన్మానించి, అభినందనలు తెలిపారు . వారి వెంట మ్యాకల శ్రీనివాస్, పర్శరాములు, మనోజ్ కుమార్, గ్రామంలో వివిధ కుల సంఘ పెద్దలు గుడిసె అనిల్, ఐత వెంకటేశం, కొప్పెర సంతోష్ రెడ్డి, కొమురయ్య, జనార్ధన్ రెడ్డి, సతీష్ రెడ్డి ,మూలె మునిందర్, మహేష్, పురుషోత్తం, వికుర్తి సాయి కుమార్, వీరేందర్, గుడిసె కుమార్జ్ బండ మహినీధర్ తదితరులు ఉన్నారు.


ఆహ్వానం



నెలపొడుపు
సాహిత్య సాంస్కృతిక వేదిక
Regd No. 288/2019
మరియు
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
సంయుక్త ఆధ్వర్యంలో

ధిక్కార
మహాత్మా పూలే స్ఫూర్తి కవిత్వం ఆవిష్కరణ

తేది: 08.06.2024 శనివారం, ఉ. 10 గం.లకు
రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్.

ఆహ్వానం : పి. వహీద్ ఖాన్ గారు
కవి, కథకులు

సభాధ్యక్షులు : డా. సంగిశెట్టి శ్రీనివాస్ గారు
సాహిత్య విమర్శకులు, చరిత్ర కారులు

ముఖ్య అతిథి మరియు పుస్తక ఆవిష్కర్త :
బుర్ర వెంకటేశం గారు IAS
విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి తెలంగాణ ప్రభుత్వం

విశిష్ట అతిథులు : గోరటి వెంకన్న గారు
MLC, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
జూలూరు గౌరీ శంకర్ గారు
మాజీ అధ్యక్షులు తెలంగాణ సాహిత్య అకాడమీ
జి. లక్ష్మీనరసయ్య గారు
కవి, విమర్శకులు
డా. మామిడి హరికృష్ణ గారు
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం
డా.బి. ప్రసాదమూర్తి గారు
కవి, విమర్శకులు
డా.ఏ. జయంతి గారు
విశ్రాంత అధ్యాపకులు, కవి, రచయిత్రి
డా. పసునూరి రవీందర్ గారు
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత

సంపాదకుల తరుపున స్పందన :
వనపట్ల సుబ్బయ్య గారు
కవి, రచయిత

వందన సమర్పణ : ఆమ్ గోత్ వెంకట్ పవార్ గారు
కవి, రచయిత

నిర్వహణ : కందికొండ మోహన్, కల్వకోల్ మద్దిలేటి, ఎదిరెపల్లి కాశన్న, ముచ్చర్ల దినకర్, యం.డి. ఖాజ.


IN THE COURT OF THE HON'BLE XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD
O.S. NO.46 OF 2024

Between:
**Ramarapu Prameela and Others** .....Plaintiffs
Vs
**1. Union Bank of India Res.by its Branch Manager and 2 Others** ...Defendants

To
All Concerned ...Defendant No.3

WHEREAS the above named Plaintiffs have filed the above suit seeking the relief of declaration to declare plaintiffs herein as only legal heirs of deceased Late R. Ramanyya in respect of Schedule A to C properties against the defendants. The said suit is stand posted on **05-07-2024** for appearance of the defendant No 3 and the persons interested,

Therefore, the persons interested are hereby directed to appear before the above said Court on **05-07-2024** at 10-30 AM in person or by Pleader duly instructed, positively, failing which the matter will be heard and determined ex-parte.

(BY THE ORDER OF THE COURT)

**M/S. K. SHASHIDHAR (TS/1963/2005)**
Advocate.
#Unit No G-3B, T-19 Towers, Rani Gunj, Secunderabad-03.
Cell: 9848051273.

# దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసిన 2టౌన్ పోలీసులు



భద్రాద్రికొత్తగూడెం, జూన్ 6 (నేటినిజం ప్రతినిధి) : గత 15 నెలల క్రితం అనగా ఫిబ్రవరి నెల 2023లో కొత్తగూడెం 2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీబి నగర్ నందు నివాసముండే మనోహర్ బాబు అనే వ్యక్తి తన యొక్క ఇద్దరు పిల్లలు ఒకరు అమెరికాలో,ఒకరు బెంగళూరులో ఉండడంతో వృద్ధ దంపతులు ఇంటి వద్దనే ఉన్నారు. వారి ఇంటిపై భాగంలోని పోర్షన్లో మహావీర్ అనే వ్యక్తి కుటుంబముతో సహాగత నాలుగు సంవత్సరాలుగా అద్దెకు వుంటున్నారు. వీరు అట్టి వృద్ధ దంపతులతో స్నేహంగా,సన్నిహితంగా ఉంటూ వారి ఇంటికి వేసే రెండవ తాళం యొక్క తాళపు చెవిని దొంగిలించి అదనుచూసి వారు ప్రతి రోజు గుడికి పూజకు వెళ్తారని భావించి రాత్రి పూట వారు టెంపుల్ కి వెళ్ళిన సమయంలో వారికి అనుమానం రాకుండా సదరు మహావీర్ ఆ ఇంటి యొక్క తాళం తీసి వారి ఇంటిలోని బీరువాలో ఉన్న సుమారుగా 117గ్రాముల బంగారు ఆభరణాలైన నక్లెస్,చైను,నాలుగు గాజులు దొంగిలించి వాటిని తన ఇంట్లో దాచిపెట్టుకున్నాడు. అయితే మనోహర్ బాబు అత్యవసరంగా పని నిమిత్తం తను తన భార్య తెల్లవారు జామునే అమెరికా వెళుతూ వారి ఇంట్లోని నగలు లేకపోవడంతో దొంగతనం జరిగిందని భావించి హడావిడిలో వాళ్ళు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోవడం జరిగింది. వాళ్లు అమెరికా వెళ్లిపోయి న తర్వాత వాళ్ళ యొక్క మిత్రుడుకి ఫోన్ చేసి పోలీస్ స్టేషన్లో పిటిషన్ ఇవ్వమని చెప్పగా వారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఇట్టి విషయంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సదరు మనోహర్ బాబు అమెరికా నుంచి రాగా వారి నుంచి పూర్తి సమాచారం తెలుసుకొని దర్యాప్తు ముమ్మరం చేయగా వారి ఇంటి పైన ఉంటున్న మహావీర్ అనే వ్యక్తి ఆ ఇంటిలో దొంగతనం చేశారని అట్టివస్తులను గురువారం తను అమ్మడానికి వెళుతున్న క్రమంలో పోలీసులు చాకచక్యంగా గోధుమ వాగు బ్రిడ్జి వద్ద పట్టుకొని అతన్ని విచారించగా దొంగతనం చేసింది తానే అని ఒప్పుకోగా అతని వద్ద నుంచి ఒక బంగారు ఆభరణాలను రికవరీ చేసి అతని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపించడం జరిగింది. ఇట్టి సొమ్ము విలువ 7లక్షల 60వేల రూపాయలు ఉంటుందని సిఐ రమేష్ వివరాలను వెల్లడించారు.

# ఎయిర్ పోర్టులో కంగనాకు చేదు అనుభవం..

హైదరాబాద్, జూన్ 6 :ప్రముఖ బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు చేదు అనుభవం ఎదురైంది. గురువారం చండీగఢ్ ఎయిర్‌పోర్ట్‌లో ఓ మహిళా సీఐఎస్ఎఫ్ జవాన్ ఆమెను చెంప దెబ్బ కొట్టింది. సెక్యూరిటీ చెకింగ్ సమయంలో కంగనా, మహిళా సెక్యూరిటీ ఉద్యోగి మధ్య వాగ్వాదం జరిగింది.. రైతులపై ద్వేషపూరితంగా మాట్లాడినందుకు కంగనా రనౌత్‌ను సీఐఎస్ఎఫ్ జవాన్ చెంపదెబ్బ కొట్టినట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే మహిళా జవాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆ తర్వాత కంగనా రనౌత్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఢిల్లీలో జరగనున్న బీజేపీ సమావేశానికి హాజరయ్యేందుకు చండీగఢ్ విమానాశ్రయానికి చేరుకోగా? సెక్యూరిటీ చెకింగ్ సమయంలో కుల్వీందర్ కౌర్ అనే లేడీ జవాన్ తనను చెంపదెబ్బ కొట్టినట్టు కంగనా తన ఫిర్యాదులో పేర్కొంది.

# కరాటే తో ఏకాగ్రత ఆత్మరక్షణ తెలంగాణ కరాటే చీఫ్ ఎగ్జామినేర్ కె. వసంత్ కుమార్




కరీంనగర్, జూన్ 6 : (నేటినిజం ప్రతినిధి) కరాటే నేర్చుకోవడం ద్వారా స్వీయ రక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణ , జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందని కరాటే తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్ కే వసంత్ కుమార్ అన్నారు. కరీంనగర్ పట్టణం లో ఒకి నావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రోజున వేసే విశిక్షణ శిబిరంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థిని విద్యార్థులకు 4 గురికి బ్రౌన్ బెల్ట్,1 ఒక్కరికి బ్లూ బ్లూ బెల్ట్, గ్రీన్ బెల్ట్, ఆరంజ్ బెల్ట్ 9 మంది విద్యార్థులకు ఎల్లో బెల్ట్ లను సర్టిఫికెట్లను తెలంగాణ కరాటే చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్ కుమార్ అందజేశారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థిని,విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా ఆత్మ రక్షణ విద్య అయినా కరాటే నేర్చుకోవటం సంతోషకరమని అన్నారు. ఈకార్యక్రమంలోకరాటే కోచ్ పి. శ్రీనివాస్‌పాల్గొన్నా రు.

# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం.. ఆందోళనలో స్థానికులు

హైదరాబాద్, జూన్ 6 : నాంపల్లి పటేల్ నగర్‌లో గురువారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికంగా ఉన్న ఫర్నీచర్ గోదాంలో మంటలు చెలరేగాయి.

అగ్నికీలలు ఎగిసిపడుతున్నాయి. గోదాం చుట్టుపక్కల ఉన్న నివాసాలకు మంటలు వ్యాపిస్తున్నాయి. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తోంది. స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com